
# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
22-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:122

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# కమలం, కారు దోస్తీ!

## కూటమి అధికారంలోకి వస్తే మొదటి అవకాశం బిజెపికి

ముఖ్యమంత్రిగా బండి సంజయ్

చివరి రెండున్నర ఏళ్ళు కేటీఆర్

ఇరు పార్టీల కీలక నాయకులు కేంద్రమంత్రివర్గంలోకి

రెండు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం జరగనుందా? భారత రాష్ట్ర సమితితో భారతీయ జనతా పార్టీ పొత్తు పెట్టుకోనుందా? ఈ మేరకు రాష్ట్ర బిజెపి నేతలకు క్లారిటీ వచ్చిందా? బిజెపి జాతీయ అధ్యక్షుడు ఈ విషయంలో స్పష్టతనిచ్చారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో సరికొత్త ప్రచారం ప్రారంభం అయింది. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ఆ రెండు పార్టీల మధ్య పొత్తు ఉంటుందని తేలిపోయింది. గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారం నిజమేనని తెలుస్తోంది.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదు.. తెలంగాణలో అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ప్రధాన ప్రతిపక్షంగా భారత రాష్ట్ర సమితి కొనసాగుతోంది. మరోవైపు సార్వత్రిక ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలను సాధించి

- మిగతా 2వ పేజీలో

# వాసాలమర్రికి మహర్దశ!

## భారీగా అభివృద్ధి పనులు

గ్రామాన్ని దత్తత తీసుకున్న కేసీఆర్

రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తానని హామీ

తరువాత బుట్ట దాఖలు


ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టిన సీఎం రేవంత్



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏ అవకాశాన్ని విడుచుకోవడం లేదు. గులాబీ పార్టీ వైఫల్యాలని సోఫానాలుగా మార్చుకున్నారు. ప్రధానంగా వాసాలమర్రి గ్రామం అభివృద్ధి పై ఫుల్ ఫోకస్ పెట్టారు. దానికి కారణం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. గతంలో సీఎంగా ఉన్నప్పుడు కెసిఆర్ ఈ వాసాలమర్రిని దత్తత తీసుకున్నారు. గ్రామ రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు.

2లో



# చంద్రబాబుపై పెద్ద బాధ్యత!

పార్లమెంట్ ముంగిటకు డీ లిమిటేషన్ బిల్లు

విపక్షాలను ఒప్పించే బాధ్యత ఏపీ సీఎంకు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్నారు. బుధవారం హస్తినబాట పట్టనున్నారు.

మిగతా 2లో

# ఇళ్లు కట్టకముందే కేటాయింపు

లబ్ధిదారులను ఎంపిక చేశాక నిర్మాణం

క్యూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల పథకం

అమలులో ప్రభుత్వం కొత్త విధానం

లబ్ధిదారు ఎంపిక కాగానే రూ.లక్ష చెల్లించాలి

మిగిలిన రూ.5 లక్షలు 4 వాయిదాల్లో

ఒక్కో లబ్ధిదారుకు యూడీస్ కింద

17 నుంచి 22 గజాల స్థలం ఉచితంగా రిజిస్ట్రేషన్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల పథకంలో ప్రభుత్వం గతానికి భిన్నమైన విధానాన్ని అనుసరించనుంది.



మిగతా 2లో

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ నేతల ఆందోళన

కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత

బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు

రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్



**న్యూఢిల్లీ,జులై :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ

మిగతా 2లో

# కేంద్ర పెద్దల దయ కోసం జగన్!

ప్రధాని, హోంమంత్రి అపాయింట్మెంట్ కోసం ప్రయత్నం

మద్యం కుంభకోణం కేసులో ముంచుకొస్తున్న ముప్పు

నోటీసులు అందించేందుకు ఈడి సిద్ధం



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దాదాపు 3,800 కోట్ల రూపాయల మద్యం కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి.


మిగతా 3లో

# జిహెచ్ఎంసి ఎన్నికలకు బ్రేక్!

హైకోర్టు కీలక ఆదేశాలు

వార్డుల డీ లిమిటేషన్ పూర్తయ్యే వరకు నోటిఫికేషన్ ఇవ్వద్దంటూ సూచన

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనని అర్థం అవుతోంది. ఎన్నికల నిర్వహణపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అయితే తాజాగా




# ఏపీలో డేంజర్ బెల్స్!

పెరుగుతున్న కరోనా కేసులు

కొత్త వేరియంట్ తో విరుచుకుపడుతున్న మహమ్మారి


**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో కరోనా కేసులు కలకలం సృష్టిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్నాయి.



మిగతా 2లో




# వాసాలమర్రికి మహర్దశ!




## వాసాలమర్రికి మహర్దశ!

గ్రామానికి రూ.100 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయిస్తామని.. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, మోడల్ పంచాయితీ భవనం, అత్యాధునిక పాఠశాలలు, విశాలమైన రోడ్లు నిర్మిస్తామని అప్పట్లో సహపంక్తి భోజనాలు చేసి మరి కెసిఆర్ ప్రకటించారు. కానీ అటు తరువాత ఆ గ్రామం ఎటువంటి అభివృద్ధి చెందలేదు.

**కాగితాలకి పరిమితం..**

గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని చెప్పి పాత ఇళ్లను కూల్చివేశారు. కానీ పనులను అర్థాంతరంగా వదిలేసారు. దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్ప లేదు. క్షేత్రస్థాయిలో గ్రామస్తులు తలదాచుకునేందుకు కూడా ఇబ్బంది పడ్డారు. ప్రచార ఆర్బాటాల కోసం దత్తత డ్రామాలు ఆడారే తప్ప.. ఆ ఊరి రూపురేఖలు మార్చడంలో నాటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కేవలం అప్పట్లో దత్తత గ్రామం గా ఉన్న వాసాల మర్రి కి సీఎం కాన్వాయ్ సులువుగా వచ్చేందుకు కేవలం రహదారులు వేసి చేతులు దులుపుకున్నారు.

**మళ్లీ జీవం పోసే ప్రయత్నం..**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కెసిఆర్ చేసిన చారిత్రాత్మక తప్పిదం పై సీఎం రేవంత్ ఫుల్ ఫోకస్ పెట్టారు. వాసాల మర్రి కి మళ్లీ జీవం పోసే ప్రయత్నం చేశారు. ఇందిరమ్మ పథకం కింద ఏకంగా 143 ఇళ్లను మంజూరు చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. ఇల్ల నిర్మాణాలు శరవేగంగా జరుపుతున్నారు. లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు.

### అభివృద్ధి ప్రణాళిక..

అయితే ఆ గ్రామంలో కేవలం గృహ నిర్మాణం మాత్రమే కాదు. పాఠశాల భవనాలు, గ్రామపంచాయతీ వసతులు, రహదారుల పునర్నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను కూడా జిల్లా అధికారులు వేగవంతం చేశారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యటించనున్నారు ఆ గ్రామంలో. గత పాలకులు అటకెక్కించిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పరుగులు తీస్తోంది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ప్రచారాల కోసం ఊళ్లను దత్తత తీసుకుని వదిలేసే సంస్కృతికి స్వస్తి పలికి.. వాసాల మర్రిని ఒక ప్రత్యేక అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దాలని రేవంత్ సర్కార్ నిర్ణయించడం మాత్రం గొప్ప విషయమే. ఈ విషయంలో కెసిఆర్ ను ఇరకాటంలో పెట్టేందుకు రేవంత్ వ్యూహరచన చేశారు. అందులో సక్సెస్ అయ్యారు.

## చంద్రబాబుపై పెద్ద బాధ్యత!

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లును మరోసారి తీసుకురానందన ప్రచారం నడుస్తోంది. ఇటువంటి సమయంలో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన జరుపుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఢిల్లీలో సీఎం చంద్రబాబు కొంతమందితో కీలక చర్చలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇవే రెండు ప్రతిష్టాత్మక బిల్లులు పార్లమెంటులో తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పుడు మరోసారి ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది అనే వార్తలు వస్తున్నాయి.

**కీలక భాగస్వామిగా..**

కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉంది. గత కొంతకాలంగా డీలిమిటేషన్ బిల్లుపై చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి నష్టం జరుగుతుందన్న వాదనను తోసిపుచ్చారు చంద్రబాబు. అన్ని రాష్ట్రాలతో సమానంగానే దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని.. ఈ విషయంలో ఎటువంటి ఆందోళన వద్దు అని చంద్రబాబు మిగతా రాజకీయ పక్షాలను కోరారు కూడా.

**మిగతా పార్టీలతో దౌత్యం..**

అయితే డి లిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో చంద్రబాబు ఢిల్లీ వెళ్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్లమెంటులో బిల్లు ఆమోదానికి అవసరమైన మూడంతుల మెజారిటీ కోసం వివిధ ప్రాంతీయ, విపక్షం పార్టీలను ఏకీకృతం చేయడంలో చంద్రబాబు దౌత్యం నడుపుతున్నారని వార్తలు బలంగా వినిపించాయి. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలగకుండా.. 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలయ్యేలా జాతీయస్థాయిలో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు.. ఆయన పలువురు పార్టీ నేతలతో అంతర్గత చర్చలు జరుపుతున్నారు.

**కేంద్ర మంత్రులతో భేటీ..**

అయితే ఢిల్లీ పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించనున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు విడుదలపై ప్రధాని నరేంద్ర మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా లతో పాటు కేంద్ర మంత్రులతో ఆయన సమావేశం అయ్యే అవకాశం ఉంది. మొత్తానికి అయితే ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన దేశ పొలిటికల్ సర్కిల్స్ లోనే పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.

## ఇళ్లు కట్టకముందే కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)




టవర్లలో ఫ్లాట్లుగా నిర్మించే ఈ ఇండ్లను ముందుగా లబ్ధిదారులను ఎంపిక చేశాకే నిర్మించాలని నిర్ణయించింది. తద్వారా గందరగోళానికి తావులేకుండా చూడవచ్చని భావిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి.. ఆ తరువాత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడంతో వాటి కోసం తీవ్ర పోటీ ఏర్పడి సమస్యలు తలెత్తాయి. దీంతో ఇప్పుడు అలాంటి సమస్య రాకుండా.. ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ ఇళ్లను టవర్లలో అపార్టుమెంట్లుగా నిర్మిస్తున్నందున ముందుగానే ఫ్లాట్లకు లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. ఒకవేళ నిర్మించదలచిన ఇళ్ల కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే.. అందరి సమక్షంలో లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఇక.. ఇంటి కోసం ఎంపికైన లబ్ధిదారు తన వాటాకు సంబంధించిన రూ.6 లక్షల్లో ఇంటి కేటాయింపు జరగగానే రూ.1 లక్ష చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.5 లక్షలను ఇంటి నిర్మాణం పూర్తయ్యేలోపు నాలుగు విడతల్లో చెల్లించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.

**4 బ్లాక్‌లు.. ఒక్కో బ్లాక్‌లో 120 ఫ్లాట్లు..**

ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్లను క్యూర్ పరిధిలో మొదటి విడతగా 16 నియోజకవర్గాల్లో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ 16 నియోజకవర్గాల్లో గుర్తించిన 16 స్థలాల్లో తొలివిడతలో పైలట్ విధానంలో టవర్లను నిర్మించనున్నారు. ఒక్కో స్థలంలో 4 బ్లాక్‌ల చొప్పున వీటిని నిర్మిస్తారు. ఒక్కో బ్లాక్‌లో 120 ఫ్లాట్‌లు ఉండనుండగా, ఒక్కో అంతస్తులో 12 ఫ్లాట్‌లను నిర్మించేలా అపార్ట్‌మెంట్‌లను డిజైన చేశారు. మొత్తంగా 4 బ్లాకుల్లో కలిపి 480 ఇళ్లను నిర్మిస్తారు. కాగా, ఈ అపార్ట్‌మెంట్లలోని ఒక్కో బ్లాక్‌లో రెండు మెట్ల మార్గాలు, రెండు వైపులా లిఫ్టు సౌకర్యం కల్పించనున్నారు. ఒక్కో ఫ్లాట్‌లో హాలు (లివింగ్ రూమ్) విస్తీర్ణం 20 అడుగులు నిలువు, 9-4.5 వెడల్పుతో, కిచెన 5-6/6-0 విస్తీర్ణం, బెడ్‌రూమ్ 9-0/10 అడుగుల్లో, యుటిలిటీ ఏరియా 3-1.5/5, బాతరూమ్ 5-7.5/4.3 అడుగుల విస్తీర్ణంలో కలిపి ఒక్కో ఫ్లాట్‌ను 528 చదరపు అడుగుల్లో నిర్మించనున్నారు. ఇక ఇందిరమ్మ ఎల్ఐజీ పథకం కింద నిర్మించే టవర్లలో ఇళ్లు పొందే లబ్ధిదారులకు ప్రభుత్వం అందులోని స్థలాన్ని కూడా అందించనుంది. ఒక్కో లబ్ధిదారుకు సుమారు 17 నుంచి 22 గజాల వరకు స్థలం దక్కనుంది. ఆ స్థలాన్ని లబ్ధిదారు పేరిట (మహిళ పేరు మీద) ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట?్రేషన చేయించి ఇవ్వనుంది. దీని ప్రకారం ఒక్కో లబ్ధిదారుకు రూ.20-30 లక్షల విలువ చేసే ఆస్తి దక్కుతుందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

**ఏడాదిలోగా నిర్మాణం పూర్తి..**

ప్రస్తుతం అపార్ట్‌మెంట్‌ల నిర్మాణానికి అవసరమైన నిర్మాణ సంస్థను ఖరారు చేసేందుకు టెండర్ల ప్రక్రియ, నిబంధనలను అధికారులు ఖరారు చేస్తున్నారు. లబ్ధిదారులకు కేటాయింపులు పూర్తయ్యాకే టవర్లను నిర్మించనున్న నేపథ్యంలో 12 నెలల కాలంలోనే.. అంటే ఏడాదిలోనే నిర్మాణాలను పూర్తిచేయాలని టెండర్ నోట్‌లో పొందుపరచనున్నారు. తద్వారా నిర్మాణాలు శరవేగంగా పూర్తవుతాయని, లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లను అందించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.



## ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ నేతల ఆందోళన

పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు.

## ఏపీలో డేంజర్ బెల్స్!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 19 కి చేరాయి. వైయస్సార్ కడప జిల్లాలో ఎనిమిది కేసులు నమోదయ్యాయి. అయితే తాజాగా నమోదైన కేసులన్నీ కొత్త వేరియంట్ అని తెలుస్తోంది. అయితే అంత ఆందోళన అవసరం లేదని.. అప్రవత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. 25 రోజుల్లో కరోనా సోకిన బాధితుల్లో నలుగురు మృతి చెందారు. కానీ వారికి ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అయితే తాజా ఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. రాష్ట్రంలో గుర్తించిన 19 కేసుల శాంపిల్స్ ను పరీక్షలకు పంపించింది. పూణేలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ రీసెర్చ్ సంస్థలో నమూనాలను పరీక్షిస్తే.. ఆర్ ఎఫ్ 5 వేరియంట్గా నిర్ధారించారు. అయితే ఈ కొత్త వేరియంట్ తో అంత పెద్ద ప్రమాదం లేదని.. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

**ఆందోళన చెందాల్సిన పనిలే..**

అయితే ఈ ఆర్ ఎఫ్ 5 వేరియంట్ కు సంబంధించి.. కోవిడ్ రెండు వైరస్ కాలక్రమంలో ఒమిక్రాన్ గా రూపాంతరం చెందింది. దీని మరో రూపం జేఎన్ 1 నుంచి ఎల్ ఎఫ్ 7,1.1.1 బ్రాంచులు ఏర్పడ్డాయి. వీటి రెండింటి కలయిక ఆర్ ఎఫ్ 5 అని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు. ప్రధానంగా ఈ వేరియంట్ సోకిన వారు దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తలనొప్పి, ఒళ్ళు నొప్పులతో బాధపడతారు. జ్వరం బారిన పడతారు. వెంటనే టెస్టులు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**వైద్యుల కీలక సూచనలు..**

రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు రద్దీప్రదేశాల్లో మాస్కులు ధరిస్తూ.. చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా షుగర్, శ్వాస సంబంధిత సమస్యలు, గుండె, కిడ్నీ రోగులు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. కరోనా లక్షణాలు ఉన్నవారు తొలుత హోం ఐసోలేషన్ లో ఉండాలని.. రోజుల తరబడి తగ్గకపోతే మాత్రం వెంటనే వైద్యులను ఆశ్రయించాలని చెబుతున్నారు. కడపలో తీవ్రస్థాయిలో కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గుంటూరులో సైతం కేసులు వెలుగులోకి వస్తున్నాయి. మంగళగిరి తో పాటు బాపట్ల ప్రాంతంలో కూడా కేసులు నమోదవుతుండడం విశేషం.

## నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని

### పిల్లలను రెచ్చగొట్టదన్న మోడీ

### నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

న్యూఢిల్లీ,జులై:నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని వ్యాఖ్యానించారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీక్‌లను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మాట్లాడారు. ఆయన మాట్లాడిన అంశాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉందని ప్రధాని సూచించారు. 'పిల్లలను రెచ్చగొట్టొద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో ప్రధాన పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ (ఔఇఇఃు) మేలో నిర్వహించగా.. పేపర్ లీక్ ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి.




# కమలం, కారు దోస్తీ!




(మొదటి పేజీ తరువాయి)

బలం పెంచుకునే పరిస్థితికి వచ్చింది భారతీయ జనతా పార్టీ. ఇటువంటి పరిస్థితుల్లో త్రిముఖ పోటీ జరిగితే కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుంది. అలా వ్యతిరేక ఓటు ఆ రెండు పార్టీలు సర్దుకుంటాయి. అంతిమంగా అది అధికార కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూరుస్తుంది. అందుకే ఆ రెండు పార్టీల ఆలోచన మారినట్లు తెలుస్తోంది. కలిసి పోటీ చేస్తేనే అధికారంలోకి వచ్చేందుకు అవకాశం ఉంది.

**రెండు పార్టీలకు అనివార్యం..**

భారత రాష్ట్ర సమితి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 37 సీట్లతో ప్రతిపక్షంలోకి వచ్చింది. భారతీయ జనతా పార్టీ 8 అసెంబ్లీ సీట్లకు పరిమితం అయింది. అయితే సార్వత్రిక ఎన్నికలకు వచ్చేసరికి పూర్తిగా సీన్ మారిపోయింది. భారత రాష్ట్ర సమితి పూర్తిగా చతికిల పడింది. కానీ బిజెపి అనూహ్యంగా పుంజుకుంది. ఏకంగా ఎనిమిది పార్లమెంటు స్థానాలతో అధికార కాంగ్రెస్ పార్టీతో సమానమైన సీట్లు సాధించింది. తెలంగాణ లో జరిగిన బైపోల్స్ లో భారత రాష్ట్ర సమితి గెలవలేదు. తద్వారా ఒక రకమైన రాజకీయ శూన్యత ఏర్పడింది తెలంగాణలో. కచ్చితంగా భారత రాష్ట్ర సమితితో బిజెపి జతకడితేనే అక్కడ అధికారంలోకి వచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. అందుకే ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేసేందుకు మానసికంగా సిద్ధపడినట్లు తెలుస్తోంది.

**మొదటి చాన్స్ బిజెపికి..**

తెలంగాణలో ఎలాగైనా అధికారం చేపట్టాలన్నది బిజెపి ఆలోచన. అందుకే భారత రాష్ట్ర సమితితో జత కలిసి పోటీ చేయాలన్నది మెజారిటీ నేతల అభిప్రాయం. ఒకవేళ ఈ కూటమి అధికారంలోకి వస్తే ముందుగా బిజెపి నేత ముఖ్యమంత్రి పదవి చేపడతారు. అయితే ఇప్పటికే బీజేపీతో పాటు భారత రాష్ట్ర సమితి మధ్య ఒక సర్దుబాటు జరిగినట్లు ప్రచారం సాగుతోంది. కూటమి అధికారంలోకి వస్తే తొలి రెండున్నర సంవత్సరాలు బిజెపి నేత బండి సంజయ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు.. చివరి రెండున్నర సంవత్సరాలు కేటీఆర్ సీఎం అయ్యేందుకు చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఇక ఇరు పార్టీల్లో బలమైన నేతలుగా ఉన్న హరీష్ రావు, ఈటెల రాజేందర్, కిషన్ రెడ్డి, లక్ష్మణ్ లాంటి నాయకులు కేంద్రమంత్రివర్గంలోకి వెళ్తారని ప్రచారం సాగుతోంది. మొత్తానికైతే వచ్చే ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితితో బిజెపి జత కలవడం ఖాయమని తెలియడం మాత్రం ఆ రెండు పార్టీల్లో ఒక రకమైన జోష్ కనిపిస్తోంది. అదే సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం ప్రారంభం అయింది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# జిహెచ్ఎంసి ఎన్నికలకు బ్రేక్!

(మొదటి పేజీ తరువాయి)

జిహెచ్ఎంసి ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు నీళ్లు చల్లింది. జిహెచ్ఎంసిలో వార్డుల పునర్విభజన ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వార్డుల సరిహద్దులను చట్టబద్ధంగా తిరిగి నిర్ధారించే వరకు ఇటువంటి నోటిఫికేషన్ ఇవ్వద్దని ఆదేశించింది. ఈ పరిణామంతో జిహెచ్ఎంసి ఎన్నికల షెడ్యూల్ పై అయోమయం నెలకొంది.

**నిబంధనలకు విరుద్ధం అంటూ..**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసి వార్డుల పునర్విభజన జరిపింది. అయితే ఈ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరిపారని ఆరోపిస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. 1996 జీవో నెంబర్ 570 లోని రూల్ 5 ప్రకారం జనాభా ప్రాతిపదికనే వార్డుల డీలిమిటేషన్ జరగాలని.. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనలను పాటించలేదని పిటిషనర్లు వాదించారు. తెలంగాణ మున్సిపాలిటీ 2019లోని సెక్షన్ 6 ప్రకారం ప్రజల అభ్యంతరాలు స్వీకరించి.. పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా.. నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు ప్రాథమికంగా పిటిషన్ లో ఉన్న అంశాలను పరిశీలించింది. తదుపరి విచారణ పూర్తయ్యే వరకు వార్డుల సరిహద్దులను చట్టబద్ధంగా పునర్నిర్ణయించాలని.. అప్పటివరకు జిహెచ్ఎంసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది.

**రాజకీయ పార్టీలు సిద్ధం..**

అయితే ఇప్పటికే జిహెచ్ఎంసి ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలు సన్నాహాలు మొదలుపెట్టాయి. వ్యూహాల్లో నిమగ్నమయ్యాయి. కోర్టు ఆదేశాల ప్రభావం పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం డీ లిమిటేషన్ ప్రక్రియను ఎలా సమర్థించుకుంటుంది.. తదుపరి విచారణలో ఎలాంటి ఆధారాలు సమర్పిస్తుంది అనే అంశాలపై ఎన్నికల భవిష్యత్తు ఆధారపడనుంది. హైకోర్టు తుది తీర్పు వచ్చేవరకు జీహెచ్ఎంసి ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే అవకాశం లేదని న్యాయవర్గాలు చెబుతున్నాయి. ఇంకో వైపు చూస్తే ఎన్నికల కోసం అన్ని రాజకీయ పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. మేయర్ పీఠాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ గట్టి ప్రయత్నాల్లో ఉంది. భారత రాష్ట్ర సమితి తో పాటు భారతీయ జనతా పార్టీ సైతం వ్యూహాలు సిద్ధం చేశాయి. కానీ కోర్టు వారి ఆశలపై నీళ్లు చల్లింది.

# కేంద్ర పెద్దల దయ కోసం జగన్!

దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగింది. రాజ్ కసిరెడ్డి నుంచి ఎంతోమంది అరెస్టయ్యారు. దాదాపు అంతమందికి బెయిల్ వచ్చింది కానీ రాజ్ కసిరెడ్డి మాత్రం ఇంకా రిమాండ్ ఖైదీగానే కొనసాగుతున్నారు. ఈ కేసులో ఏ 5 నిందితుడిగా ఉన్నారు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి. ఆయన ఇచ్చిన సమాచారం తోనే ఈ విచారణ కొనసాగినట్లు తెలుస్తోంది. అయితే ఢిల్లీ మద్యం కుంభకోణానికి మించిన స్కాం ఇది అని తెలుస్తోంది. అందుకే ఈడి ఎంట్రీ ఇచ్చిన తరువాత వైసిపి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మరోవైపు ఈడి త్వరలో జగన్మోహన్ రెడ్డికి నోటీసులు ఇవ్వనుందని.. ఆయనను విచారణకు పిలిచి అరెస్టు చేసే ఛాన్స్ ఉందని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి కేంద్ర పెద్దల అపాయింట్మెంట్ కోరినట్లు తెలుస్తోంది..

**ఢిల్లీ స్కాంకు మించి..**

ఢిల్లీ లిక్కర్ స్కామ్ జాతీయస్థాయిలోనే ప్రకంపనలు సృష్టించింది. అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీని దారుణంగా దెబ్బతీసింది. ఈ కేసులో దేశవ్యాప్తంగా ప్రముఖులు అరెస్ట్ అయ్యారు. కెసిఆర్ కుమార్తె కవిత తో పాటు అరబిందో శరత్ చంద్రారెడ్డి వంటి వారు కూడా అరెస్టు అయ్యారు. అయితే ఈ కేసుకు మించి ఏపీలో మద్యం కుంభకోణం దందా సాగినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున అవినీతి జరగడంతోనే ఈడి ఎంట్రీ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఎప్పుడైతే ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగిందో.. అప్పటినుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. అయితే అంతిమ లబ్ధిదారుడు జగన్మోహన్ రెడ్డి అని నేరుగా ఆరోపిస్తున్నారు కూటమి నేతలు. ఈ నేపథ్యంలో జగన్ పాత్ర పై ఆధారాలు లభించడంతో ఈడి ఆయనకు విచారణకు పిలిచేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. నోటీసుల జారీకి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

**సీనియర్లంతా జైలుకు..**

మద్యం కుంభకోణం కేసులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లంతా జైలుకు వెళ్లారు. ప్రారంభంలో రాజ్ కసిరెడ్డి అరెస్టు అయ్యారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ఆయనే. వైసీపీ హయాంలో సీఎమ్ఓ అధికారిగా ఉన్న ధనుంజయ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి ఓ ఎస్ డి కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి లాంటి పెద్ద పెద్ద నేతలంతా అరెస్టయ్యారు. అయితే ఈ కేసులో అంతిమ లబ్ధిదారుడు జగన్మోహన్ రెడ్డి అన్న ఆరోపణలు వచ్చాయి. అందుకే ఆయన చుట్టూ ఉచ్చు బిగుస్తున్నట్లు గత కొంతకాలంగా ప్రచారం సాగుతోంది. అయితే ఇప్పుడు ఈడి నేరుగా నోటీసులు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

**అపాయింట్మెంట్కు ప్రయత్నం..**

ఈడి నోటీసులు ఇవ్వనున్న నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి కేంద్ర పెద్దలను ఆశ్రయించేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అపాయింట్మెంట్ కోరినట్లు టాక్ నడుస్తోంది. భారతీయ జనతా పార్టీలో ఉన్న సన్నిహిత నేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈడి దూకుడును తగ్గించి తనపై కేసుల తీవ్రతను తగ్గించుకునేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. మరోవైపు మద్యం కుంభకోణం కేసులో జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ అయ్యే అవకాశం లేదని.. ఎంత మాత్రం కూటమి ప్రభుత్వం ఛాన్స్ ఇవ్వదు అని.. కానీ విచారణకు పిలిచే అవకాశం ఉందని మాత్రం తెలుస్తోంది. మొత్తానికి అయితే మద్యం కుంభకోణం మళ్లీ కదలిక వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు రేపుతోంది.

# డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ముఖాముఖి

**ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి పర్మినెంట్ కార్పొరేషన్**

**చట్టబద్ధత ఇవ్వాలని జెఎసిల డిమాండ్**

హైదరాబాద్,జులై 21(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సంప్రదింపులు కొనసాగిస్తోంది. మంగళవారం వైద్యులు, న్యాయవాదులు, విలేఖరులుసమక్షంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు మరియు వివిధ వర్గాల అగ్రశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు, అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు), ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్), ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్), టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. సమావేశానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా హాజరై కమిటీకి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. భారత స్వాతంత్య సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల ప్రతులను కమిటీ ప్యానల్కు సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు పక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పందిస్తూ.. 'నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్ ఛార్జీగా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు. పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రాన్ని సాధించారని, వారి ప్రతి డిమాండ్ అత్యంత సమంజసమైనదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, ఈ విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణ అసెంబ్లీని సందర్శించిన మిజోరాం స్పీకర్

**స్వాగతించి సత్కరించిన స్పీకర్ ప్రసాద్ కుమార్**

హైదరాబాద్,: తెలంగాణ రాష్ట్ర శాసనసభను మిజోరాం రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ పూ లాల్ బిక్జామా ఆయన సతీమణి వాన్ లాల్ రుటిలు సందర్శించారు. వారికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ స్వాగతం పలికారు. అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్ లో సమావేశమైన ఇరు రాష్ట్రాల స్పీకర్లు, అసెంబ్లీల సమావేశాల నిర్వాహణ, పనితీరు, పద్దతులపై చర్చించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మిజోరాం స్పీకర్ కి తెలంగాణ సభాపతి ప్రసాద్ కుమార్ వివరించారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ తరుపున మిజోరాం స్పీకర్ ని, వారి సతీమణిని శాలువాతో సత్కరించి మెమొంటో ను బహూకరించారు. కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, లెజిస్లేటివ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# దిష్టిబొమ్మ దగ్ధం చేయడంతో ఏం లాభం

**గడ్డి తగులబడుతందే తప్ప ప్రయోజనం ఉండదు**

**ఎమ్మార్పీస్ చర్యకు అంబటి రాంబాబు కౌంటర్**

గుంటూరు:ఎమ్మార్పీఎస్ నాయకులు తన దిష్టిబొమ్మను దగ్ధం చేయడంపై మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హోంశాఖ మంత్రి అనితను తాను పరుష పదజాలంతో విమర్శించానని, కుల దూషణ చేశానని వస్తున్న ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. తాను ఎక్కడా అనుచిత పదజాలం ఉపయోగించలేదని, ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, గతంలో పురాణాల్లో విన్న దారుణాలు ఇప్పుడు నేరుగా రోడ్లపై కనిపిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన దిష్టిబొమ్మలు తగలబెట్టుకున్నంత మాత్రాన తనకు వచ్చే నష్టమేమీ లేదని, గడ్డి తగలబడటం తప్ప తన శరీరానికి ఏమీ కాదని వ్యాఖ్యానించారు.

ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అంబటి తెలిపారు. తాను అనని మాటలను అన్నట్లుగా ఆరోపించి, రాజకీయంగా దెబ్బతీయాలని చూడటం ధర్మం కాదన్నారు.

# కాంగ్రెస్ ధర్నాపై ఆప్ ఎదురుదాడి

న్యూఢిల్లీ,జులై:కాంగ్రెస్ ధర్నాపై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తీవ్ర ఆరోపణలు చేసింది. ఆ పార్టీకి చెందిన ఎంపీ సంజయ్ సింగ్ కాంగ్రెస్ నేతల్ని ప్రశ్నించారు. సీజేపీ నిరసనను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని ఆయన ఆరోపించారు. సీజేపీ నిరసనను బలహీనపరిచేందుకు, మోడీజీ రాహుల్ గాంధీని తన నివాసంలో నిరసనకు కూర్చోబెట్టారు అని ఆయన ఎక్స్‌లో రాశారు. ఇదే విషయంపై ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ నేత అతిషా సోషల్ మీడియాలో కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇది అద్భుతం! సీజేపీ, సోనమ్ వాంగ్‌చుక్ నెల రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్నారు. మోదీ ప్రభుత్వం వారితో చర్చలకు నిరాకరిస్తోంది. అదే సమయంలో, రాహుల్ గాంధీని ప్రధాని నివాసం బయట నిరసన తెలిపేందుకు అనుమతించారు. గంటలోపే మోదీ ప్రభుత్వం చర్చలు ప్రారంభించింది. వావ్!' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారు.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్

4 బుధవారం 22-7-2026

**దేశంలో ఆందోళనలను పట్టించుకునేందుకు పాలకులకు తీరిక లేకుండా పోయింది. కేంద్రంలోని ప్రభుత్వమైనా, రాష్ట్రాల్లోని వివిధ పార్టీల నేతృత్వంలో ఉన్న ప్రభుత్వాలకైనా ఇది కనపడడం లేదు. అన్నా హజారే లాంటి వారు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే స్థితిలతో పాలకులు లేరు. రాజకీయ అవినీతిపై ఆయన యుద్ధం చేస్తున్నా, ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఇరవైరోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆమరణ దీక్షలో ఉన్నారు. ఆయన ఎందుకు దీక్ష చేస్తున్నారు..ఎందుకు నిరసనలకు దిగారన్న కనీస ఆలోచన కూడా చేసే పరిస్థితిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లేదు. ఎన్‌డిఎకు మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా కిమ్మనడం లేదు.**

ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో పనికిరాదు. మొత్తంగా పోటీ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినివున్న పరిస్థితుల్లో ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్న సంస్కరణలపై మాట్లాడటా నికీ, తగిన చర్యలు చేపట్టడానికీ ప్రభుత్వానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. ప్రజల పక్షాన నిరశనలు, ఉద్యమాలు చేయడం వాంగ్‌చుక్‌కు కొత్తకాదు. రేపోమాపో ఆయన దీక్ష విరమించినా ఎవరూ దానిని వైఫల్యంగా భావించరు. కానీ, నెలన్నరనుంచి సాగుతున్న ఈ ఉద్యమాన్ని బేఖాతరు చేయడం ప్రభుత్వానికి అప్రదిష్ఠతెస్తుంది, మానవత్వం, జవాబుదారీతనం కొరవడ్డాయన్న అభిప్రాయానికి తావిస్తుంది. శాంతియు తంగా సాగుతున్న నిరసనను అలాగే ముగిసేట్టు చూడాల్సిన బాధ్యత ఇరుపక్షాలపైనా ఉంది. కొందరు నిస్వార్థ పరులు దేశం కోసం ఏదో చేయాలన్న తపనలో ఉంటారు. వారు తమ ఆకాంక్షను నిరసలన ద్వారా తెలియచేస్తారు. వాటిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదు. తాజాగా సోనమ్ వాంగ్ చుక్ దీక్ష ఈ కోవలోకే వస్తుంది. నీట్ తప్పిదాలకు బాధ్యత వహిస్తూ కేంద్రవిద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో వాంగ్‌చురక్ దీక్షకు దిగారు. నిజానికి సోనమ్ ను పిలిచి మాట్లాడవచ్చు. లూఏదా ఆయన దీక్షను విరమించేలా, ప్రభుత్వం

## ప్రజాగొంతుకపై అంకుశం !

తీసుకున్న చర్యలను వివరించ వచ్చు. కానీ ప్రభుత్వం అలా చేయకుండా యాన దీక్ష భగ్నానికి యత్నించింది. అంటే దీక్షలను కూడా తట్టుకునే స్థితిలో పాలకులు లేరని గుర్తించాలి. 1984లో లద్దాఖ్ వాసులకు ఎస్టీ హోదా ఇవ్వాలంటూ వాంగ్‌చుక్ తండ్రి వాంగ్యాల్ ఇలాగే దీక్షకు దిగితే నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా లెహ్ వెళ్ళి, డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చి దీక్ష విరమింపచేసిన విషయం మరచిపోరాదు. 2011లో సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే దీక్ష సందర్భంలోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మానవతా దృక్పథంతో వ్యవహరించారు. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ చర్చించడం ద్వారా పెద్దమనసు చాటుకున్నారు. వాంగ్‌చుక్ ఈ దీక్షకు దిగడానికి బీజేపీమీద ఆయనకు ఉన్న పాతకక్షలే కారణమంటూ కొన్ని హిందీ చానెళ్ళలోనూ, సోషల్ మీడియాలోనూ బురదజల్లే పని జోరుగా సాగడం దారుణం కాక మరోటి కాదు. ఆయన ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని, పదికేజీలకు పైగా బరువు తగ్గారని, దీక్షసాగితే కీలక అవయవాల పై దుష్ప్రభావాలు తప్పవని వైద్యబృందం హెచ్చరించడంతో పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఈ పనిచేసే ముందు వాంగ్‌చుక్‌తో మాట్లాడివుంటే పాలక పార్టీ పెద్దల గౌరవం తగ్గేది ఏమీ లేదు.. ఆయన ప్రాణానికి ప్రమాదం ఉన్నది కనుక, దీక్ష విరమింపచేయా లంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ, ప్రతీ పౌరుడి ప్రాణమూ విలువైనదేనని, వాంగ్‌చుక్‌కు ప్రభుత్వ వైద్యులతో నిరంతర పరీక్షలు నిర్వహిస్తూ, వైద్యపరమైన చర్యలన్నీ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఆయనతోపాటుగా ఆమరణదీక్షలో ఉన్న ముగ్గురు విద్యార్థినేతల ఆరోగ్యం బాగా దిగజారిందని, తక్షణమే దీక్షవిరమించాల్సిందిగా ఒకరిని వైద్యులు హెచ్చరించినట్టుగా వార్తలు వస్తున్నాయి. వాంగ్‌చుక్ మాత్రం తాను బయటకు బలహీనంగా కనిపిస్తున్నా, లోన గట్టిగానే ఉన్నానని హామీ ఇస్తున్నారు. తనను దీక్ష విరమించుకోవాలని ఒత్తిడి చేయవద్దని ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని వాంగ్‌చుక్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభిం అయినా, ఎన్‌డిఎ పక్షనేతలు ఎవ్వరు కూడా వాంగ్‌చుక్‌ను పలకరించలేదు. ఆయన పక్షాన నిలవడానికి వారికి ధైర్యం లేకుండాపోయింది. దీక్షాస్థలిని సందర్శించి మద్దతు ప్రకటిస్తున్న ప్రముఖులు, నేతలు లేకపోలేదు. కొందరు స్వయంగా వచ్చి సంఘీభావం ప్రకటిస్తే, బీజేపీ ప్రభుత్వ కఠినవైఖరిని పలు వేదికలద్వారా మరికొందరు ప్రశ్నిస్తున్నారు. నీట్ వైఫల్యం మీద స్వయంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ, ధర్మేందప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ, కాస్తంత ఆలస్యంగానైనా వాంగ్‌చుక్ పక్షాన మాట్లాడుతోంది. ఇకపోతే లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, ఆరో షెడ్యూల్ రక్షణల కోసం గత ఏడాది వాంగ్‌చుక్ సుదీర్ఘపోరాటం చేసినప్పుడు కూడా ప్రభుత్వం ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. పైగా, హింసను ప్రేరేపించారన్న ఆరోపణలతో, ఆయన మీద జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగించి, జైల్లో పడేశారు. 170 రోజులు జైల్లో ఉన్నాక, సుప్రీంకోర్టులో కేసు చివరివిడత విచారణకు రెండురోజుల ముందు ప్రభుత్వం ఆయనను విడుదలచేసింది. దానితోపాటు, ఆయనను అరెస్టుచేయడానికి ప్రాతిపదికలుగా వాడిన పాకిస్థాన్‌తో సంబంధాలు, అనుమానస్పద విదేశీపర్యటనలు, అక్రమ విరాళాల సేకరణ ఇత్యాది ఆరోపణలను కూడా గాలికి వదిలేసింది. ఓ రకంగా ప్రజల గొంతుకపై పాలకులు అంకుశం దింపుతున్నారు. తాముకోరుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం లేదు. ఇందుకు తాజా ఘటనలే నిదర్శనం.

# జీవన సంక్షోభంలో మానవ సంబంధాలు

**మనిషి జీవితం ఒక నిరంతర సంక్లిష్టమైన ప్రయాణం. పుట్టిన క్షణం నుండి తుది శ్వాస విడిచే వరకు ప్రతి ఒక్కరూ ఏదో ఒక అస్పష్టమైన ఆశతో, భవిష్యత్ స్వప్నంతో ముందడుగు వేస్తూనే ఉంటారు. ఈ సుదీర్ఘ జీవన ప్రయాణంలో మానవుడు ఎందరినో కలుస్తుంటాడు. కొందరితో స్నేహబంధాన్ని పెంచుకుంటాడు, మరికొందరిని ఆత్మీయంగా ప్రేమిస్తాడు, ఇంకొందరిపై అపారమైన నమ్మకాన్ని ఉంచుతాడు. అయితే, ఈ నమ్మకాలు, ఆశయాలు వర్తమాన సామాజిక సమీకరణాల్లో ఎంతవరకు నిలబడుతున్నాయనేది మిక్కిలి ఆలోచించదగిన విషయంగా మారింది. జీవితం అనే ఈ నాటకరంగంలో మానసిక తీరుతెన్నులు అత్యంత సున్నితమైన అంశంగా పరిణమించాయి. పారదర్శకమైన, ముత్యపు చిప్పలాంటి హృదయం ఒక్కసారి గాయపడితే, ఆ విరిగిపోయిన అనుబంధాల అద్దాలను మళ్లీ మునుపటిలా అతికించడం దాదాపు అసాధ్యం. అందుకే సమాజంలో ప్రశాంతతను కాపాడుకోవడానికి మానసిక స్థిరత్వాన్ని, హృదయ భద్రతను కాపాడుకోవాలని అనుభవజ్ఞులు, మానసిక విశ్లేషకులు సుదీర్ఘకాలంగా హెచ్చరిస్తున్నారు.**

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో మనుషుల మధ్య సంబంధాల పరిధి చిత్రమైన మలుపు తిరుగుతోంది. బంధాలు ఎంత వేగంగా ఏర్పడుతున్నాయో, అంతే క్షణికమైన కారణాలతో విచ్ఛిన్నమవుతున్నాయి. సోషల్ మీడియా ప్రభావంతో కూడిన ఈ ఆభాస ప్రపంచంలో ప్రేమ, స్నేహం, ఆత్మీయత అనేవి కేవలం క్షణికమైన అనుభూతులుగా లేదా కేవలం ప్రదర్శనలుగా మారిపోతుండటం గమనార్హం. ఇటువంటి సంక్లిష్టమైన పరిణామాల మధ్య ఒకరిని గుడ్డిగా నమ్మి, తమ అంతరంగాన్ని పూర్తిగా ఆవిష్కరించే ముందు ప్రతి ఒక్కరూ ఆచి తూచి అడుగు వేయాల్సిన అవసరం ఏర్పడింది. ప్రతి మానవ సంబంధంలోనూ రెండు వైరుధ్యమైన కోణాలు అంతర్లీనంగా దాగి ఉంటాయి. ఒకవైపు ఆనందం పులకరింపజేస్తే, మరోవైపు తీరని వేదన మిగులుస్తుంది. ముళ్ళు లేని గులాబీ లభించనట్లే, సంఘర్షణలు లేని అనుబంధాలు అరుదు. జీవితమనేది కేవలం సుఖాల సమాహారమే కాదు, అది కష్టసుఖాల మిశ్రమం. కాలచక్రం ఎల్లప్పుడూ మన ఆకాంక్షలకు అనుకూలంగా తిరగదు. సమకాలీన వాతావరణంలో మనం ఇచ్చే అమితమైన ప్రేమ, శ్రద్ధ ఎదుటివారికి సంతోషాన్ని ఇచ్చినా, కొన్నిసార్లు అది తిరిగి మనకు తీరని వేదనను, కన్నీళ్లను మాత్రమే బహుమతిగా ఇవ్వవచ్చు. ఇదే నేటి మానవ సంబంధాల లోని చేదు నిజం.మానవ మనుగడకు విశ్వాసం, ఆశ అనేవి అత్యంత ప్రాథమిక ఇంధనాలు. ఆశ లేకపోతే జీవన చక్రం స్తంభించిపోతుంది. అయితే, ఆ ఆశ అనేది వాస్తవిక పరిమితులను దాటి అతిగా పెరిగిపోతే, అది అనివార్యంగా తీవ్ర నిరాశకు, రహిత స్థితులకు దారితీస్తుంది. ఎడారిలో కనిపించే ఆకర్షణీయమైన ఎండమావులు దాహం తీర్చలేనట్లే, అవాస్తవికమైన అంచనాలు జీవితాన్ని శూన్యంలోకి నెట్టివేస్తాయి. మనసులో మెదిలే కోరికలను నిత్యం సామాజిక వాస్తవికతలతో బేరీజు వేసుకోవడం పరిణతి చెందిన లక్షణం. లేకుంటే, ఆ నెరవేరని ఆశలు అంతర్గతంగా మనిషిని దహించివేస్తూ, ప్రశాంతతను



మసిచేస్తాయి.విశేషించి అనుబంధాల విషయంలో ఈ సమతుల్యత అత్యంత అవసరం. నిర్దిష్టమైన వ్యక్తులు ఎల్లప్పుడూ మనతోనే ఉంటారని, మన సంక్షేమం కోసమే పరితపిస్తారని భావించడం అమాయకత్వమే అవుతుంది. జీవితం అనేది ఒక నిరంతర ప్రవాహం. ప్రవహించే నదిలో కొయ్య బొమ్మల్లా ప్రయాణించే పయాణీకులం మనం. ఈ క్రమంలో కొందరు కొంత దూరం తోడుగా వస్తే, మరికొందరు సుదీర్ఘ ప్రయాణంలో భాగస్వాములవుతారు. కానీ కాలక్రమేణా ప్రతి ఒక్కరూ తమ గమ్యస్థానాలకు అనుగుణంగా వేరవ్వక తప్పదనే సత్యాన్ని సమాజం గుర్తించాలి. ఈ జీవన సూత్రాన్ని ఆమోదించినవారే క్లిష్ట పరిస్థితుల్లో సైతం మానసిక స్థైర్యాన్ని కలిగి ఉంటారు.పరుగుల ప్రపంచంలో నగర జీవన శైలి మనుషులను యంత్రాలుగా మారుస్తోంది. లక్ష్యాల వెనుకాల పరిగెడుతున్న క్రమంలో కాసేపు ఆగి స్వయం పరిశీలన చేసుకునే వ్యవధి కరువైంది. నాణేనికి ఉన్న రెండో వైపులా మనం ఎటువైపు ప్రయాణిస్తున్నాం? మన సామాజిక, వ్యక్తిగత నిర్ణయాలు సరైన బాటలోనే సాగుతున్నాయా? మనం ప్రదర్శిస్తున్న ఆత్మీయత అర్హులైన వారికే చెందుతోందా? అని పునరాలోచించుకోవడం ఎంతైనా అవసరం. సామాజిక ప్రయాణంలో కొన్ని సుడిగుండాలు బహిర్గతంగా కనిపించవు. కానీ అవి మనిషి అస్తిత్వాన్ని కోలుకోలేని విధంగా ముంచెత్తగలవు. అటువంటి ప్రమాదాల నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి తొందరపాటు వైఖరి కంటే వ్యవహార శైలిలో వివేకం, నిదానం చాలా ముఖ్యం.ఎంతటి సన్నిహిత సంబంధాలలోనైనా వ్యక్తిగత స్వయంప్రతిపత్తి, అదృశ్యమైన సరిహద్దులు ఉంటాయనే విషయాన్ని గుర్తించాలి. ఇద్దరు వ్యక్తులు ఎంతగా కలిసిపోయినా, వారి గత అనుభవాలు, భావజాలం, భవిష్యత్ ప్రాధాన్యతలు వేర్వేరుగా ఉండే అవకాశం ఉంది. ఈ వ్యత్యాసాలను గౌరవించకుండా, సంపూర్ణ త్యాగాన్ని లేదా ఏకత్వాన్ని ఆశించడం ఘర్షణలకు మూలకారణమవుతుంది. కాబట్టి, నమ్మకం, ఆప్యాయతల విషయంలో ఒక హేతుబద్ధమైన నియంత్రణను పాటించడం వివేకవంతమైన మార్గం.మొత్తంగా పరిశీలిస్తే, మానవ జీవితం అనేది అత్యంత అరుదైన అవకాశం. దానిని ఆవేశంతో కాకుండా, ఆలోచనతో నడిపించుకోవాలి. బాహ్య ప్రపంచానికి మన మనసును పూర్తిగా మూసివేయాల్సిన పనిలేదు, అలాగని ప్రతి ఒక్కరినీ విచక్షణ లేకుండా నమ్మడమూ ప్రమాదకరమే. ఆశలు కలిగి ఉండటం ప్రగతికి సంకేతమే అయినా, అవి వాస్తవ దూరంగా ఉండకూడదు. వైఫల్యాలు, కష్టాలు, వియోగం జీవన చక్రంలో అంతర్భాగమని గ్రహించి, వాటిని ధీరత్వంతో ఎదుర్కొనే మానసిక దృఢత్వాన్ని అలవర్చుకోవడమే నిజమైన జీవన నైపుణ్యం. ఈ ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకున్నప్పుడే మనిషి వ్యక్తిగత, సామాజిక జీవితాల్లో సంతృప్తిని సాధించగలడు. లోకంలో ఎంతటి మార్పులు వచ్చినా, విమర్శలు ఎదురైనా మన ఆత్మగౌరవాన్ని, హృదయ భద్రతను పదిలంగా కాపాడుకోవడమే మానవ మనుగడకు అసలైన పరమార్థం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో నెలవారీ నేర సమీక్ష సమావేశం...!

### సమావేశంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ డా"తరుణ్ జోషి, ఐపీఎస్,పోలీస్ అధికారులు

### సీసీ కెమెరాల విశ్లేషణ,సాంకేతిక ఆధారాలు, డిజిటల్ ఫోరెన్సిక్ పై నిఘా పెట్టాలి --- సిపి తరుణ్ జోషి

### ప్రజలకు స్నేహపూర్వక, పారదర్శక, జవాబు దారీతనంతో కూడిన పోలీసింగ్ అందించాలి...!

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి, ఐపీఎస్ సోమవారం ఇబ్రహీంపట్నంలోని గురు నానక్ ఇన్‌స్టిట్యూట్లో మహేశ్వరం జోన్ నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహేశ్వరం జోన్ డీసీపీ కె.నారాయణ రెడ్డి, ఐపీఎస్, ఏడీసీపీ (ఎస్‌వోటీ) శ్రీ సైక్ జహంగీర్, ఏసీపీ మహేశ్వరం ఎస్. జానకి రెడ్డి, ఏసీపీ ఇబ్రహీంపట్నం కె.పీ.వి.రాజు, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్ బాబు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.వీరబాబు ,మరియు మహేశ్వరం జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... నేరాల నివారణ, దర్యాప్తు నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజా భద్రత వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.కమిషనర్ ఇచ్చిన ముఖ్య ఆదేశాలు:గ్రేవ్ అన్‌డిటెక్టెడ్ (UI) కేసులను త్వరితగతిన ఛేదించి నిందితులను గుర్తించాలి.పోక్సో, ఎస్సీ/ఎస్టీ,మహిళలు మరియు చిన్నారులకు సంబంధించిన కేసులను అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నారు చార్జ్‌షీట్లను నాణ్యతతో సకాలంలో కోర్టులకు దాఖలు చేసి శిక్షల శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక బృందాలతో పని చేయడంతో పాటు ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి,మాదక ద్రవ్యాల (డ్రాగ్ పెండింగ్) నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి సరఫరా గొలుసును పూర్తిగా అరికట్టాలి,రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్




తనిఖీలను నిరంతరం నిర్వహించాలి.పెండింగ్ వారెంట్ల అమలు, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగించి అవసరమైన వారిపై పీడీ యాక్ట్ ప్రతిపాదనలు పంపించాలి,సీసీటీఎన్ఎస్ (జజుచీూ) మరియు ఈ–సాక్షి (వ–ఝుఎంష్ట్రఱ) వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తును వేగవంతం చేయాలి,బీట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజలతో నిరంతర సంబంధాలు పెంపొందించాలి,సీసీ కెమెరాల విశ్లేషణ, సాంకేతిక ఆధారాలు, డిజిటల్ ఫోరెన్సిక్ పద్ధతులను సమర్థంగా వినియోగించి నేరాల ఛేదన వేగవంతం చేయాలని సూచించారు,పునరావృత నేరాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి ముందస్తు నిరోధక చర్యలు చేపట్టాలని ఆదేశించారు, ప్రజా భద్రతకు భంగం కలిగించే అంశాలను ముందుగానే గుర్తించి, స్థానిక పోలీసు, బీట్ అధికారులు ప్రజలతో సమన్వయం పెంచి నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, శాస్త్రీయ పరిశోధనా విధానాలు పాటించడం ద్వారా కోర్టుల్లో బలమైన అభియోగాలు నమోదు అయ్యేలా చూడాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్ కేసులు,ఫిర్యాదులు ఎప్పటికప్పుడు సమీక్షించి బాధితులకు త్వరితగతిన సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు స్నేహపూర్వక, పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పోలీసింగ్ అందిస్తూ,చట్టం మరియు శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి అధికారి అంకితభావంతో పనిచేయాలని కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు.

# కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం రిజర్వాయర్లు మంజూరు చేసి, భూపరిహారం ఇవ్వకుండా ఆ రిజర్వాయర్లలోకి నీటిని ఎక్కడి నుండి తీసుకురావాలనే విషయాన్ని గాలికి వదిలేసిన బీఆర్ఎస్

**తన రాజీనామా తో ప్రభుత్వాన్ని భూనిర్వాసితుల కాళ్ల దగ్గరికి తీసుకొచ్చి భూనిర్వాసితులకు పరిహారం అందేలా చేసిన రాజ్ గోపాల్ రెడ్డి**

సశీస్థాన్ నారాయణపురం, జూలై 21(క్రైమ్ మిర్రర్): పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన డిండి ఎత్తిపోతల పథకం ద్వారా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల కు సాగు త్రాగునీరు అందించడానికి గత పాలకులు ఈ రెండు నియోజకవర్గాలలో రిజర్వాయర్ల పనులు మొదలుపెట్టారు.. మునుగోడు నియోజకవర్గంలోని శివన్నగూడెం, లక్ష్మణాపురం రిజర్వాయర్ల కింద భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు పరిహారం చెల్లించకుండానే పనులు మొదలుపెట్టారు...ఎన్నిసార్లు భూపరిహారం కోసం అసెంబ్లీలో రాజ్ గోపాల్ రెడ్డి కొట్లాడిన నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం..తాను గెలిచి ఈ నియోజకవర్గానికి ఏమి చేయలేకపోతున్నాననే ఆవేదనతో తాను రాజీనామా చేస్తేనన్న అబివ్రుద్ధి జరుగుతుందని భావించి రాజీనామా చేశారు...రాజ్ గోపాల్ రెడ్డి రాజీనామాతో ప్రభుత్వం భూనిర్వాసితుల కాళ్ల దగ్గరికి వచ్చి మరి పరిహారం అందించింది..1756 మందికి భూ పరిహారం తో పాటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబందించిన నిదులు యుద్ధప్రాతిపదికన విడుదల చేసి ఇచ్చారు...రాజ్ గోపాల్ రెడ్డి రాజీనామాతో అప్పటివరకు భూనిర్వాసితులను పట్టించుకోని బీఆర్ ఎస్ ప్రభుత్వం సుమారు 180 కోట్ల నుండి 200 కోట్ల వరకు పంచాల్సి వచ్చింది... ఆతరువాత ఉపఎన్నికల్లో బీఆర్ఎస్



గెలిచినా రిజర్వాయర్ పనులలో ఎటువంటి పురోగతి పనులు కొనసాగలేదు..ప్రజాప్రభుత్వం అదికారంలోకి వచ్చాకే నిర్మించిన రిజర్వాయర్లకు ఎక్కడి నుండి నీటిని తీసుకురావాలనే దానిపై రిటైర్ట్ ఇంజినీర్ల బ్రుందంతో వ్యక్తిగతంగా ఎన్నోమార్లు సమీక్షలు జరిపిన రాజ్ గోపాల్ రెడ్డి ఏదుల నుండి నీటిని తరలించాలని ప్రభుత్వానికి విన్నవించారు...నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఎన్నో మార్లు చర్చించి ఏదుల నుండి నీటిని తరలించేలా వెంటనే టెండర్ల ప్రక్రియను కూడా పూర్తిచేశారు...దానికి సంబందింన టన్నెల్ పనులు ఇతర పనులకు టెండర్లు పూర్తయ్యాయి... ఒకవైపు ఈ ప్రయత్నం చేస్తూనే మరోపక్కఏదుల రిజర్వాయర్ నుండి ఏ స్థాయి నుండి నీటిని తీసుకునే అంశానికి సంబందించి రెండు జిల్లాల నేతలతో ఎన్నోమార్లు ఫోన్లో మాట్లాడి ఒప్పించి ఇరు ప్రాంతాలకు నష్టం జరగకుండా ఏదుల వద్ద 437.35 ఎత్తు నుండి నీటిని తరలించేలా చేయడంతో రాజ్ గోపాల్ రెడ్డి క్రుషి అంతా ఇంతా కాదు..ప్రపంచంలోనే అత్యంత ఫ్లోరైడ్ కలిగిన రక్కసితో మునుగోడు ప్రజల కోసం ఒక వైపు నీటిపారుదల ఉన్నతాదికారులతో మరో వైపు ఆయా శాఖల మంత్రులతో పాటు మహబూబ్ నగర్ జిల్లాకి చెందిన ప్రజాప్రతినిదులతో అనునిత్యం మాట్లాడుతూ మునుగోడు ప్రజలు పడుతున్న ఆవేదనను వాళ్లకి చెప్పి ఖచ్చితంగా మాకు 437.35 ఎత్తు నుండి నీటిని ఇవ్వాలని ఒప్పించేలా చేశారు...

బీఆర్ఎస్ పార్టీ అదికారంలో ఉన్నపుడు కనీసం భూపరిహారం కోసం కేసీఆర్ దగ్గరికి వెళ్లి మట్లాడే దైర్యం చేయలేని మాజీ ఎమ్మెల్యే ఇపుడు ఉద్యమం చేసి ఏదుల వద్ద ఒప్పించాననడం హాస్యాస్పదంగా ఉంది...


ప్రతిపక్షంలో ఉన్నపుడు తన రాజీనామాత మునుగోడు కు నిదుల వరద పారించాడు.అదికారంలో ఉండి మునుగోడుకు కావాల్సిన వనరులను తీసుకురావడంలో అహర్నిషలు శ్రమిస్తున్నారు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

## సమగ్ర ఓటర్ సవరణ కు అండగా ఉమాదేవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్



**కుత్బుల్లాపూర్, జూలై 21 (క్రైమ్ మిర్రర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రోడామేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని ఉమాదేవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఓటరు సవరణ (సర్) కార్యక్రమంలో బాధ్యతాయుతంగా పాల్గొంటూ అధికారులకు సహకారం అందిస్తున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పేరవేన సమ్మయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి కూరపాటి కరుణాకర్ రాజు మాట్లాడుతూ, సర్ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి తమ కాలనీలో బీఎల్ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు దరఖాస్తులను నింపించడంతో పాటు అధికారులకు అన్ని విధాలుగా సహకరిస్తున్నామని తెలిపారు. అలాగే బీఎల్ఓలు, బీఎల్ఏలకు తమ అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని, వారితో కలిసి బస్తీలో పర్యటిస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రజాస్వామ్య బలోపేతమే లక్ష్యంగా ప్రతిరోజూ సర్ కార్యక్రమంలో పాల్గొంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకుని, ఓటరు వివరాలను సరిచేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి షేర్విరాల కృష్ణమూర్తి గుప్తా, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


## బాధ్యతలు చేపట్టిన లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ నూతన కమిటీ




**అధ్యక్షులుగా రవికుమార్,**

**కార్యదర్శిగా మహంకాళి రావు, కోశాధికారి గా కర్ణ శ్రీనివాస్ ఎన్నిక**

**ప్రమాణం చేసిన 30 మంది బోర్డు అఫ్ డైరెక్టర్**

**క్లబ్ సేవలను కొనియాడిన వక్తలు**

**కుత్బుల్లాపూర్, జూలై 21 (క్రైమ్ మిర్రర్):** లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ నూతన కమిటీ అధ్యక్షులు గా రవి కుమార్ అనుముల శెట్టి పదవి బాధ్యతలు చేపట్టారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ 15 వ ఇన్స్టాలేషన్ కార్యక్రమం జీడీమెట్ల లోని జెఐఎ హాల్ లో జరిగింది. నూతన కమిటీ చే 320 బి ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అవంతి రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి జిఏటి ఏరియా లీడర్ ఆవుల గోపాలరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 320బి డిస్ట్రిక్ట్ లో సికింద్రాబాద్ నార్త్ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మల్లా రెడ్డి అస్పత్రి వద్ద నిరంతరాయంగా ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందించడం గొప్ప విషయం అన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టడం లో క్లబ్ లోని ప్రతి సభ్యుడు ముందుంటారని కొనియాడారు. నూతన కమిటీ కార్యదర్శి గా మహంకాళి రావు, కోశాధికారి గా కర్ణ శ్రీనివాస్ లతో పాటు 30 మంది బోర్డు అఫ్ డైరెక్టర్ లు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రత్యేక వ్యక్త గా మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మామిడాల శ్రీనివాస్,320 బి సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఆంజనేయులు, లయన్స్ క్లబ్ ముఖ్యులు రాజేంద్ర ప్రసాద్, దీపక్ బట్టాచార్య, విజయ్ కుమార్ శెట్టి, వినోద్ జాదవ్, ఫ్రాన్సస్ తదితరులు పాల్గొన్నారు.


## బాలానగర్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ కార్యక్రమం.. బీఆర్ఎస్ నాయకుల భాగస్వామ్యం



**బాలానగర్, జూలై 21 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ పరిధిలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా 49, 52 బూత్ నంబర్ల పరిధిలో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను అందజేస్తూ, వాటిని సక్రమంగా నింపి నిర్దేశిత గడువులోపు సమర్పించాలని అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదై ఉండేలా, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణల కోసం ఈ కార్యక్రమం ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ యువజన నాయకులు సందీప్ గౌడ్, రాజేష్ గౌడ్, రిషికేష్ యాదవ్, మాజీ మహిళా అధ్యక్షురాలు కవితా కాతురాయి పాల్గొని ఓటర్లతో మాట్లాడారు. ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు పూర్తి చేసుకోవాలని వారు సూచించారు. అలాగే, బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) నర్సింగ్, శ్రీలక్ష్మి కూడా కార్యక్రమంలో పాల్గొని ఓటర్లకు ఫారాల పంపిణీతో పాటు వాటి వినియోగంపై పూర్తి వివరాలు తెలియజేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ, ఫారాలు నింపే విధానాన్ని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని, ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు, ఓటర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు దాడి చాలా బాధాకరం

**తీవ్రంగా ఖండించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు .**



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు యువకులు చేపట్టే ఉద్యమంలో భాగంగా ఢిల్లీలో శాంతితంగా నిరసన చేపడుతున్న విద్యార్థులపై లాటిఛార్జ్ చేయడం పట్ల ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు తీవ్రంగా ఖండించారు.లాటి దెబ్బలతో విద్యార్థులు ఉద్యమాన్ని ఆపలేరు..ప్రశ్నిస్తున్న యువతపై దాడులు బీజేపీ భయానికి నిదర్శనం అని అన్నారు..కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు..విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు అండగా నిలుస్తుందని తెలియజేశారు.నీట్ పేపర్ లీకేజ్ పై సరైన దర్యాప్తు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు.

## అనాథ వృద్ధురాలికి ఎండీఆర్ ఫౌండేషన్ అంత్యక్రియలు

**మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ఎండీఆర్ ఫౌండేషన్ సేవలు**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 21:** మానవత్వమే మహోన్నతమైన సేవ అనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్ మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగంపల్లి సమీపంలో అనాథ వృద్ధురాలి మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించింది. పోలీసుల సమాచారం మేరకు, లింగంపల్లి ప్రాంతంలో చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సు గల ఓ అనాథ వృద్ధురాలు రోడ్డుపై మృతదేహంగా కనిపించింది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆమె వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఎలాంటి బంధువులు లేదా గుర్తింపు వివరాలు లభించలేదు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని స్వీకరించిన ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు పూర్తి గౌరవ మర్యాదలతో అంత్యక్రియలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, జన్మనిచ్చిన వారు లేకపోయినా చివరి ప్రయాణంలో ఎవరూ ఒంటరిగా ఉండకూడదనే మానవతా భావంతో అనాథలకు గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు పలకడం తమ సేవా కార్యక్రమాల్లో ముఖ్యమైన బాధ్యతగా కొనసాగిస్తున్నామని తెలిపారు.

## వరప్రదాత షిర్డిసాయి మందిర్ లో శ్రీ షిర్డిసాయి దీక్షలు ప్రారంభం

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం :** ఖమ్మం గాంధీచౌక్ వరప్రదాత షిర్డిసాయి మందిరం 16వ గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా మంగళవారం సాయినాధుని భక్తులు సుమారు 300 మంది సాయి మాలాధారణ ను ధరించారు.ఉదయం బాబా వారికి పంచామృత అభిషేకం గోపూజ శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వరప్రదాత శిరిడి సాయి మందిర్ చైర్మన్ డాక్టర్.వేములపల్లి వెంకటేశ్వరరావు అరవపల్లి నిరంజన్ పొట్టి వెంకట దుర్గా ప్రసాద్ కురువెళ్ళ జగన్ మోహన్ రావు , కాకరపర్తి సూర్యనారాయణ వేములపల్లి శ్రీనివాస్ రావు వేములపల్లి నరేష్ గన్నవరపు నాగేశ్వరరావు కుసుమ శ్రీనివాసరావు బోనగిరి ఉమేష్ నోముల శ్రీనివాస్ నూనె శ్రీనివాసరావు శీలం హనుమంతరావు తదితర భక్తులు పాల్గొన్నారు



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 బుధవారం 22-7-2026

# ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 21:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళ ´వారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎలక్ట్రోరల్ రోల్‌ను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా రూపొందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే భారత ఎన్నికల సంఘం లక్ష్యమని తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నందున, నిర్ణీత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు సగటున 70 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. నియోజక ´వర్గాల వారీగా నారాయణఖేడ్‌లో 85 శాతం, అందోల్‌లో 80 శాతం, జహీరాబాద్‌లో 75 శాతం, సంగారెడ్డిలో 71 శాతం, పటాన్‌చెరులో 52 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో మాట్లాడుతూ, అన్ని నియోజకవర్గాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో వార్డు అధికారులు, ఇతర వాలంటీర్ల సహకారంతో ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని, వలస వెళ్లిన వారు, మృతి చెందిన వారు, డబుల్ ఓటర్లు వంటి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరించి, తప్పులు లేని పారదర్శక ఓటరు జాబితాను రూపొందించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్‌పై రాంగ్ రూట్ డ్రైవింగ్

### ఆర్ఎంసీ లారీ డ్రైవర్ అరెస్ట్




**గండిపేట(క్రైం మిర్రర్):** ఔటర్ రింగ్ రోడ్ పై లారీని రాంగ్ రూట్‌లో, అతివేగంగా నడుపుతూ ఇతర వాహనదారుల ప్రాణాలతో చెలగాటమాడిన లారీ డ్రైవర్‌ను ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జూలై 19 రాత్రి సుమారు 10:25 గంటల సమయంలో టిఎస్08 యుహెచ్8667 నంబర్ గల రెడీ మిక్స్ కాంక్రీట్ లారీని డ్రైవర్ ఔటర్ రింగ్ రోడ్‌పై తప్పు దిశలో అత్యంత నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపాడు. దీనికి సంబంధించిన దృశ్యాలను కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమం ట్విట్టర్ లో పోస్ట్ చేయడంతో ఆ వీడియో తీవ్రంగా వైరల్ అయింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోను తీవ్రంగా పరిగణించిన ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల సహాయంతో సదరు ఆర్ఎంసీ లారీ డ్రైవర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్ లవ్‌కుష్ కుమార్ (22) అత్యంత ప్రమాదకర రీతిలో వాహనం నడిపి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించినందుకు గాను, సదరు డ్రైవర్‌పై తదుపరి చట్టపరమైన కఠిన చర్యల నిమిత్తం అతడిని షంషాబాద్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు ఆర్జీఐఏ ట్రాఫిక్ పిఎస్ ఎస్‌హెచ్‌ఓ బి. ప్రమోద్ కుమార్ తెలిపారు.

## తారా ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### 16 విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ ఖాళీలు



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 21:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు 2026--27 విద్యా సంవత్సరానికి తారా ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపక (గెస్ట్ ఫ్యాకల్టీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ తెలిపారు. ఇంగ్లీష్ (3), తెలుగు (2), బీబీఏ (2), బీబీఏ రిటైలింగ్ (1), బీకాం--బీఎఫ్ఎస్ఐ (1), బీకాం--హెచ్ఆర్ (1), బీసీఏ (2), కెమిస్ట్రీ (1), ఫార్మా (1), ఎకనామిక్స్ (1), హిస్టరీ (1), పొలిటికల్ సైన్స్ (1), పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (1), కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ (4), డేటా సైన్స్ (1), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (1) విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ అర్హతతో పాటు నెట్/సెట్/పీహెచ్‌డీ, బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవ ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను జూలై 23 సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు జూలై 24 ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూ, డెమోకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్‌తో హాజరుకావాలని ప్రిన్సిపల్ తెలిపారు.

## ప్రజాధనాన్ని దోచుకోవడమే తప్ప అభివృద్ధి శూన్యం

### బిజెపి యువమోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్



**కూకట్ పల్లి, జూలై 21 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ లో ప్రజా సమస్యలపై ఎల్లమ్మబండ హనుమాన్ టెంపుల్ నుండి ఎన్టీఆర్ నగర్ కాలనీ మీదుగా జయశంకర్ కాలనీ వరకు ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు చిన్నగాలొల్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర లో బిజెపి యువమోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు రవీందర్ రావు, నరేందర్ రెడ్డి, కేశవరావు, రామరాజు, స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ లో అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డ్రైనేజ్, మంచినీటి, శానిటేషన్ సమస్యలు నిత్యం ఏర్పడుతున్న సంబంధిత అధికారులు సిబ్బంది పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఇట్టి సమస్యలతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురివుతున్న మాజీ కార్పొరేటర్ పట్టించుకోకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప అభివృద్ధి శూన్యం అని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయడంలో ఉన్న ఆలోచన ప్రజల మీద ప్రజా సమస్యల మీద ఏ ఒక్కరోజు చూపియ్యలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే జిహెచ్ఎంసి, ఆరోగ్య సిబ్బంది స్పందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు, ఈ కార్యక్రమంలో నాయకులు మని భూషణ్, వెంకట స్వామి రెడ్డి, రఘు అనిత, నరసింహచారి, జ్యోతి, సురేష్, శ్రీనివాస్, భరత్, శ్రీను, ప్రకాష్, ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, అంజి, విష్ణు, రమేష్, నరసింహా, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## సేవతో శిఖరాగ్రానికి...

## డాక్టర్ కీర్తన యాదవ్‌కు జాతీయ గౌరవం

భారత వైద్యుల సంఘం జాతీయ సామాజిక సేవా పురస్కారం అందుకున్న తెలంగాణ యువ వైద్యురాలు




**కూకట్ పల్లి, జూలై 21 (క్రైమ్ మిర్రర్) :** వైద్య సేవలను ప్రజాసేవతో మేళవించి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన తెలంగాణ యువ వైద్యురాలు డాక్టర్ ఎన్. కీర్తన యాదవ్ ప్రతిష్ఠాత్మక భారత వైద్యుల సంఘం (ఐఎంఏ) జాతీయ సామాజిక సేవా పురస్కారం అందుకొని రాష్ట్రానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చారు. చిన్న వయసులోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ పురస్కారాన్ని అందుకోవడం ఆమె సేవలకు లభించిన విశిష్ట గౌరవంగా నిలిచింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది నామినేషన్లను పరిశీలించిన అనంతరం, సామాజిక సేవలో విశేష కృషి చేసిన కేవలం 25 మంది వైద్యులను మాత్రమే ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కో వైద్యుడికి మాత్రమే అవకాశం లభించగా, తెలంగాణ నుంచి డాక్టర్ కీర్తన యాదవ్ ఎంపిక కావడం రాష్ట్ర వైద్య రంగానికి గర్వకారణంగా నిలిచింది. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా ఆమె ఈ గౌరవాన్ని అందుకున్నారు. దేశ నలుమూలల నుంచి ఎంపికైన ప్రముఖ వైద్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తన యాదవ్ సేవలను భారత వైద్యుల సంఘం ప్రత్యేకంగా ప్రశంసించింది. ప్రస్తుతం ఉస్మానియా వైద్య కళాశాలలో మత్తుమందు వైద్య విభాగం (అనస్థీషియాలజీ)లో సహాయ ఆచార్యురాలిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కీర్తన యాదవ్, మరోవైపు డాక్టర్ నారి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకురాలిగా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఉచిత వైద్య శిబిరాలు, ప్రాణరక్షణకు ఉపయోగపడే గుండె-శ్వాస పునరుద్ధరణ (సీపీఆర్) శిక్షణ, మహిళల ఆరోగ్య పరిరక్షణ, యువతలో ఆరోగ్య చైతన్యం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య సహాయం వంటి కార్యక్రమాల ద్వారా వేలాది మందికి చేరువయ్యారు. వైద్య సేవను ఆసుపత్రి గోడలకే పరిమితం చేయకుండా, సమాజంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న డాక్టర్ కీర్తన యాదవ్‌కు ఈ జాతీయ పురస్కారం దక్కడం ఆమె సేవలకు దేశస్థాయిలో లభించిన గుర్తింపుగా వైద్య రంగ ప్రముఖులు పేర్కొంటున్నారు.వైద్య వృత్తిలో నిబద్ధత, సామాజిక సేవలో అంకితభావం, ప్రజల పట్ల బాధ్యత కలిసివస్తే ఎంతటి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చో డాక్టర్ కీర్తన యాదవ్ మరోసారి నిరూపించారు. ఆమె సాధించిన ఈ గౌరవం తెలంగాణకే కాకుండా యువ వైద్యులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని వైద్య, సామాజిక వర్గాలు అభినందిస్తున్నాయి.

## ఆగస్టు 2న తుక్కుగూడలో ఏఐటీయూసీ జిల్లా నాలుగవ మహాసభ

### పోస్టర్స్ ను విడుదల చేసిన నాయకులు


### మహాసభలను విజయవంతం చేయండి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



**గండిపేట(క్రైం మిర్రర్):** ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగవ మహాసభలు ఆగస్టు 2న తుక్కుగూడలో జరగబోతున్నాయి ఆ మహాసభల గోడపత్రికలను శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఎలైట్ హోటల్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జిల్లా పరిధిలోని తుక్కుగూడలో జరుగుతున్నాయి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు బరితెగించి ధరలు పెంచి కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చి ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక సమ్మెలు అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా లేబర్ కోడులను అమలు చేస్తున్నదని విమర్శించారు. జిల్లా మహాసభలలో కార్మికుల సమస్యల పైన తీర్మానాలు చేస్తున్నట్లు తెలిపారు కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఇక్కడ నిర్మాణం చేయాలని ఆయన మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే. రామస్వామి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, కే చందు యాదవ్, డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి, మంజుల, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట్ శ్రీ చిత్తారమ్మ తల్లి దేవాలయంలో బోనాల సందడి

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్



**కూకట్ పల్లి, జూలై 21 (క్రైమ్ మిర్రర్) :** ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా మూసాపేట్‌లోని శ్రీ చిత్తారమ్మ తల్లి దేవాలయం భక్తుల రద్దీతో కళకళలాడింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగాయి. అమ్మవారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి బోనాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి గీతాలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ కళారూపాల తో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు, సమృద్ధి కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించగా, బండి రమేష్ అమ్మవారికి మొక్కులు చెల్లించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆత్మీయత, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే గొప్ప పండుగ బోనాలని అన్నారు. అమ్మవారిపై ప్రజలకు ఉన్న అపారమైన భక్తి, విశ్వాసానికి ఈ ఉత్సవాలు నిదర్శనమని పేర్కొన్నారు. బోనాల పండుగ సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని, ప్రజలందరూ పరస్పర సహకారంతో, ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని చెప్పారు. అమ్మవారి కటాక్షంతో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఇంటా శాంతి, శ్రేయస్సు, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఆలయ కమిటీ చైర్మన్ తూము శ్రీనివాసరావు, కర్క పెంటయ్య, గురజాల ఎల్లేష్, మల్లేష్ యాదవ్, కలికోట శంకర్, నయీమ్, వాసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల వేడుకలతో మూసాపేట్ ప్రాంతమంతా భక్తి పారవశ్యంతో నిండిపోయి, అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. స్థానికులు, మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, జానపద కళారూపాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య శ్రీ చిత్తారమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగాయి.

# ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం..

## ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అండగా నిలవాలి ... కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్‌పల్లి, జూలై 21 (క్రైమ్ మిర్రర్) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్క నాయకుడు, బీఎల్ఏలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సందేహాలను నివృత్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. మంగళవారం చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు)తో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు సక్రమంగా నమోదు కావడంతో పాటు, ఎవరి ఓటు కూడా అనవసరంగా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గడువు ముగిసేలోపు ప్రజలకు అవసరమైన సహాయం అందించి, వారి దరఖాస్తుల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయించాలని సూచించారు. ముఖ్యంగా రెండు ప్రాంతాల్లో ఓటు నమోదై ఉన్నవారికి సరైన అవగాహన కల్పించి, ఎన్నికల నిబంధనల ప్రకారం అవసరమైన దరఖాస్తులు నింపే విధానాన్ని వివరించాలని తెలిపారు. ఎలాంటి అయోమయం లేకుండా, సరైన మార్గదర్శకత్వంతో వారి సమస్యలను పరిష్కరించాలని బీఎల్ఏలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం చాలా మంది ప్రజలు అవగాహన లేకపోవడం వల్ల దరఖాస్తులు ఎలా నింపాలి, ఏ పత్రాలు సమర్పించాలి, ఎలాంటి మార్పులు చేయించుకోవాలి వంటి విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాంటి వారికి ఓర్పుతో వివరాలు తెలియజేసి, అవసరమైన సహాయం అందించడం బీఎల్ఏలు, బీఎల్ఓల బాధ్యత అని చెప్పారు. "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి ఓటు రక్షించబడాలి. ఒక్క ఓటు కూడా కోల్పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన అన్నారు. ప్రజలు కూడా దీనిని సామాజిక బాధ్యతగా భావించి కొంత సమయాన్ని కేటాయించి తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని, అవసరమైన సవరణలు ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటేనని, అందువల్ల ప్రతి పౌరుడు తన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేస్తూ ప్రతి ఇంటికీ చేరుకుని ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అవసరమైన వారికి దరఖాస్తులు నింపడంలో సహకరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, బీఎల్ఏలు పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

# ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటరు నమోదు అత్యంత కీలకం

## దిల్ కుష్ నగర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి



**బాలానగర్, జూలై 21 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ పరిధిలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్ఓలకు కాంగ్రెస్ నేతల సూచనలు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్ కుష్ నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా కొనసాగుతున్న ఓటరు నమోదు, వివరాల సవరణ, ఎన్యూమరేషన్ ప్రక్రియపై బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓలు) అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సక్రమంగా నమోదు చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమని పేర్కొన్న మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు సవరణలు, ఇతర వివరాల నవీకరణ వంటి అంశాల్లో ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ సహకరించాలని కోరారు. ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని, తమ వివరాలను ఒకసారి తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటరు నమోదు అత్యంత కీలకమైన అంశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, మేడ్చల్ జిల్లా ఫిషర్‌మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, జిల్లా ఎస్సీ సెల్ కో-ఆర్డినేటర్ శివకుమార్, దిల్ కుష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ముజీబ్, జాయింట్ సెక్రటరీ ఎం.డి. ముక్తార్ అహ్మద్, మాజీ అధ్యక్షుడు కారీముల్లా, మహబూబ్ అలీ, మునావర్ భాయ్, సాజిద్ తదితర నాయకులు, కాలనీ వాసులు పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేయించుకోవాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందుతుందని వారు తెలిపారు.

# హెచ్సిఏ లీగ్ లో మైలార్ దేవ్ పల్లి కుర్రాడి ప్రతిభ

## ఆరు వికెట్లతో మ్యాచ్ ను తిప్పేసిన చరణ్ తేజ్ యాదవ్



**గండిపేట(క్రైం మిర్రర్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బి డివిజన్ టూ డేస్ లీగ్ అండర్-19 ఛాంపియన్షిప్ లో మైలార్ దేవ్ పల్లికి చెందిన యువకుడు బల్ల చరణ్ తేజ్ యాదవ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. 17 ఏళ్ల వయసులోనే అండర్-19 జట్టులో చోటు దక్కించుకున్న చరణ్ తేజ్ యాదవ్ ప్రస్తుతం లెగ్ స్పిన్ బౌలర్‌గా అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడు. బి డివిజన్ టు డేస్ లీగ్ ఛాంపియన్షిప్ లో హైదరాబాద్ బ్లూస్ జట్టు పై ఆరు వికెట్లు తీసుకొని కాంటినెంటల్ జట్టును ఒంటి చేత్తో గెలిపించాడు. పదేళ్ల వయస్సు నుంచి క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన చరణ్ తేజ్ అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ కనబరుస్తూ హెచ్సీఏ అండర్-16, అండర్-17 లకు ప్రాతినిత్యం వహించాడు. మైలార్ దేవ్ పల్లి కి చెందిన ఈ యువ క్రికెటర్ శివరాంపల్లి లోని సెంటర్ ఫర్ క్రికెట్ ఎక్సలెన్స్ (సీ హెచ్ సీ) కోచింగ్ సెంటర్ లో తర్ఫీదు పొందుతున్నాడు. గతంలో జరిగిన హెచ్సీఏ లీగ్లలో సైతం తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నాడు. మంగళవారం జరిగిన మ్యాచ్ లో చరణ్ తేజ్ యాదవ్ 10 ఓవర్లు బౌలింగ్ చేసి ఆరు వికెట్లు తీసుకొని కాంటినెంటల్ జట్టును గెలిపించాడు. మ్యాచ్ లో అత్యధిక వికెట్లు తీసి మ్యాన్ అఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఈ ప్రతిభతో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అందరూ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# పేపర్ లికేజ్ కీ బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలి

## సీపీఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్



**బాలానగర్, జూలై 21 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం లోని బాలానగర్ లోని శ్రీ శ్రీ నగర్ లో పేపర్ లీకేజ్ నివారించాలని జంతర్ మంతర్ లో నిరుద్యోగులు చేస్తున్న నిరసన కారులపై లాఠీచార్జిలతో, డియర్ గ్యాస్ తో నిరుద్యోగులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని నిరసిస్తూ మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం రోజురోజుకు చచ్చిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్యహితంగా శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తుంటే ఎక్కడ చూసినా దాడులు ఒకపక్క పేపర్ లీకేజీలు, ఒకపక్క అవినీతి, మరోపక్క ఆర్థిక సంక్షోభం, మరోపక్క ఇథనల్ గ్యాస్ దోపిడీ, ప్రతి పక్ష పార్టీ ల ఎంపీ లను కోనేయ్యడం, ఓ పక్క, దేశాన్ని ఆదాని, అంబానీ కీ తాకట్టు పెట్టి దేశాన్ని లూటి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశం లో పేపర్ లికేజ్ లు నివారించాలి. బాధ్యత గా కేంద్ర మంత్రి రాజీనామా చెయ్యాలని నిరుద్యోగులు నిరసన చేస్తుంటే కేంద్ర బలగాలు విచక్షణ రహితంగ వారి పై దాడి చెయ్యడం బాధాకరం అని, ఈ ఘటన ను సీపీఎం పార్టీ తీవ్రంగ ఖండిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైపాల్యాలనను దేశ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలు తొందర్లో బుద్ధి చెప్పుతారని కేంద్ర ప్రభుత్వం ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు ఏ. విజయ, యాదమ్మ, సువర్ణ, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసిటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్

**కూకట్ పల్లి, జూలై 21 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసిటీస్ ఫెడరేషన్ చైర్మన్" మెట్టు సాయి కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ జన్మదిన శుభసందర్భంగా "బోయిగూడ అఘాపుర"లోని వారి నివాసం వద్ద నిర్వహించిన వేడుకలో"ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారి శశిధర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శశిధర్ పట్వారి మాట్లాడుతూ మెట్టు సాయి కుమార్ కి భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని, ఆ భగవంతుడి ఆశీర్వాదంతో నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ఇల్లాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, యువకులు, అభిమానులు, టీం పట్వారి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి యోగా పోటీల్లో స్వర్ణం సాధించిన నీళ్ళ శ్రీధర్ గౌడ్



**గండిపేట(క్రైం మిర్రర్):** రంగారెడ్డి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లిలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా యోగాసనా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ - 2026 పోటీలలో శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన నీళ్ళ శ్రీధర్ గౌడ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పురుషుల సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీధర్ గౌడ్ బంగారు పతకం (గోల్డ్ మెడల్) తో పాటు ప్రశంసా పత్రాన్ని సొంతం చేసుకున్నారు. విజేతగా నిలిచిన శ్రీధర్ గౌడ్‌ను, పాలమాకుల గ్రామ యోగా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా శిక్షకులు కట్ట మల్లేష్ గౌడ్ తో కలిసి రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేత శ్రీధర్ గౌడ్‌తో పాటు అంతర్జాతీయ యోగా శిక్షకుడు కట్ట మల్లేష్ గౌడ్‌ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. పాలమాకుల గ్రామానికి జిల్లా స్థాయిలో మంచి పేరు తెచ్చినందుకు గాను శిక్షకుడు కట్ట మల్లేష్ గౌడ్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత యోగా వైపు అడుగులు వేసేలా ఇటువంటి మంచి కార్యక్రమాలను మరింత ఎక్కువగా చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాలమాకుల గ్రామ యోగ సమితి సభ్యులు, గ్రామ సర్పంచ్ కోటేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ యాసారం ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.

# ఫ్యాకల్టీ, తోటి విద్యార్థుల వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్య



**గండిపేట(క్రైం మిర్రర్):** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కళాశాల అధ్యాపకుడి వేధింపులు, తోటి విద్యార్థుల వ్యక్తిగత లక్ష్యింపు (పర్సనల్ టార్గెటింగ్) తట్టుకోలేక బి.టెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పుప్పాల్‌గూడలోని తన నివాసంలో జులై 19, 20వ తేదీల మధ్యరాత్రి వి. శ్రేయ (20) అనే విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శ్రేయ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, శ్రేయ రాసిన రెండు పేజీల సూసైడ్ నోట్ లభ్యమైంది. శ్రేయ స్వభావరీత్యా చాలా సున్నిత మనస్కురాలని, గత జులై 17న జరిగిన పరీక్ష సమయంలో ఒక ఫ్యాకల్టీ మెంబర్ (అధ్యాపకుడు) అందరి ముందూ అనుచిత/అవమానకర వ్యాఖ్యలు చేయడంతో ఆమె తీవ్ర మానసిక వేదనకు గురైందని సూసైడ్ నోట్ ద్వారా తెలుస్తోంది. అంతేకాకుండా, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు కొంతకాలంగా తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని వేధిస్తుండటంతో తట్టుకోలేక ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉందని, సూసైడ్ నోట్, ఆధారాల ఆధారంగా పూర్తి విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# భూ పరిహారం అందేలా చేసిన నాయకుడు రాజగోపాల్ రెడ్డి

డిండి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి పూర్తి చేసింది కాంగ్రెస్ పార్టీ...

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చిత్తశుద్ధితో ప్రజల కోసం పనిచేస్తున్నారు..

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్యా నాయక్



**సంస్థాన్ నారాయణపూరశీ, జూలై 21(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూరశీ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్యా నాయక్ మాట్లాడుతూ... డిండి ఎత్తిపోతల పథకం తెలంగాణ రాష్ట్రంలోని ఎత్తుబడి ప్రాంతాలకు కృష్ణా నది జలాలను ఎత్తిపోసి సాగునీరు, తాగునీరు అందించేందుకు రూపొందించిన కీలక నీటిపారుదల ప్రాజెక్టు అని పేర్కొన్నారు.పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో శివన్నగూడెం, లక్ష్మణాపురం రిజర్వాయర్ల నిర్మాణ పనులను గత ప్రభుత్వం ప్రారంభించినప్పటికీ, భూములు కోల్పోయిన నిర్వాసితులకు తగిన భూపరిహారం చెల్లించకుండా పనులు చేపట్టిందని విమర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన కృషిని ఆయన ప్రస్తావిస్తూ, రాజీనామా ద్వారా ప్రభుత్వాన్ని భూనిర్వాసితుల సమస్యలపై స్పందించేలా చేసి, వారికి న్యాయమైన భూపరిహారం అందేలా చేసిన నాయకుడు రాజగోపాల్ రెడ్డి అని అన్నారు.అలాగే, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పలుమార్లు చర్చించి, డిండి ప్రాజెక్టుకు అవసరమైన నీటిని తరలించే పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయించారని తెలిపారు. టన్నెల్ నిర్మాణం సహా ఇతర కీలక పనులకు సంబంధించిన టెండర్లు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు.గతంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి పనులను స్వయంగా పరిశీలించిన విషయాన్ని గుర్తుచేస్తూ, రాజగోపాల్ రెడ్డి చిత్తశుద్ధితో ప్రజల కోసం పనిచేస్తున్నారని అన్నారు. అవగాహన లేకుండా కొందరు నాయకులు చేస్తున్న విమర్శలు, దుష్ప్రచారాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని పేర్కొన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రినే ఎదుర్కొని ప్రజల ప్రయోజనాల కోసం పనులు పూర్తి చేయించే ధైర్యం, నిబద్ధత రాజగోపాల్ రెడ్డికి ఉందని అన్నారు. చివరగా, "డిండి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీనే... పూర్తి చేసేది కూడా కాంగ్రెస్ పార్టీయే" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనగాం సర్పంచ్ లోదే రఘు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మందగుల బాలకృష్ణ, కొన్ రెడ్డి నర్సింహ, యువజన నాయకులు ఉప్పల నాగరాజు, గునిగంటి రాజు గౌడ్, కోల మహేష్, అలాగే మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్యేను సన్మానించిన పడమటి శ్రీధర్ రెడ్డి**

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పడమటి శ్రీధర్ రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి ఎప్పటికప్పుడు తీసుకు వెళ్తూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని వెల్లడించారు. రాజేంద్రనగర్ డివిజన్లో సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా చూడాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, మాదూరి ప్రభాకర్ రెడ్డి, పిట్టల లక్ష్మణ్ ముదిరాజ్, చెరుకుపల్లి రణదీర్ రెడ్డి, మహమ్మద్ సీరాజ్, బద్దం శ్రీధర్ రెడ్డి, మామిడి సంజీవరెడ్డి, రాము, ధర్మారెడ్డి, సాయి మాలిక్, రడగడంపల్లి శ్రవణ్, కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఐకాన్ ఫైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు అందుకున్న కానుగంటి శ్రీశైలం

**సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా రవీంద్ర భారతిలో అందజేత**



**ఆత్మకూరు(ఎం),జూలై 21/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా మొటకొండూర్ మండలం నాంచారి పేటకు గ్రామానికి చెందిన కానుగంటి శ్రీశైలంకి ఐకాన్ తెలంగాణ అవార్డు ప్రదానం చేశారు. ఆయన నీడ్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి మండల న్యాయ సేవ అధికార సంస్థల పనిచేస్తూ వివిధ రంగాలలో సామాజిక సేవ చేసినందుకు గాను ఐకాన్ ఆఫ్ తెలంగాణ అవార్డును అందజేసినట్లు సంస్థ ప్రతినిధి, చైర్మన్ శ్రీనివాస రాజు తెలిపారు . అనంతరం శ్రీశైలం మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఎంతో సంతోషకరంగా ఉన్నదని నేను చేసిన సేవలు గుర్తించి అవార్డు అందచేసినందుకుగాను , ఆ అవార్డు అందుకున్నందుకుగాను సంతోషం వ్యక్తం చేస్తూ, రానున్న కాలంలో ఎన్నో సేవలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు, 35 ఏళ్ల కాలం నుండి చేస్తున్న సేవలకు గుర్తింపు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, మాజీ మంత్రి పుష్పలీలా, ప్రముఖులు పాల్గొని అవార్డు అందజేశారు.

## రోడ్డు పక్కన ప్లాస్టిక్ సంచిలో పసిపాప





గండిపేట(క్రైం మిర్రర్): పుట్టిన కొన్ని గంటలకే ఆ పసిపాపను కన్నవారే వద్దనుకున్నారో లేక కఠినాత్ములు ఎవరైనా వదిలేశారో తెలియదు కానీ, రోడ్డు పక్కన ఒక ప్లాస్టిక్ సంచిలో వదిలేసి వెళ్లిన దారుణ సంఘటన శంషాబాద్ వద్ద వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కాలనీ బ్రిడ్జ్ సమీపంలోని ఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పక్కన ఒక తెల్లటి సంచిలో గుర్తుతెలియని పసిపాప ఉందంటూ డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే ఆర్జీఐఏ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ తెల్లటి సంచిలో ఉన్న ఒక రోజు లేదా రెండు రోజుల వయసు కలిగిన ఆడ శిశువును సురక్షితంగా బయటకు తీశారు. తక్షణమే స్పందించిన పోలీసులు పాపను మొదట శంషాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన సంరక్షణ కోసం అమీర్‌పేట్‌లోని శిశు విహార్ కు భద్రంగా తరలించారు. పసిపాపను అలా రోడ్డు పక్కన నిర్దయగా వదిలేసి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పాపకు సంబంధించి ఎవరికైనా ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి 8712663313, 8712663310, 8712663319, సంప్రదించాలని పోలీసులు కోరారు.

## జిఎం చేతుల మీదుగా హరిత మహోత్సవం ప్రారంభం



**మందమర్రి టౌన్ జూలై 21 క్రైమ్ మిర్రర్:** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఏక్ పేడ్ మా కే నామ్" పిలుపులో భాగంగా, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ సీసీఓ దిశానిర్దేశం మేరకు మందమర్రి ఏరియాలో మంగళవారం "మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్" బృహత్ వృక్షారోపణ అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ హరిత మహోత్సవాన్ని మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ నర్సరీ ప్రాంగణంలో స్వయంగా మొక్క నాటి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నల్ల బంగారాన్ని ఉత్పత్తి చేయడమే కాకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో సింగరేణి సంస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. బొగ్గు తవ్వకాలతో పాటు హరితాహార సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మేము కట్టుబడి ఉన్నాం" అని పేర్కొన్నారు. ప్రతీ ఉద్యోగి ఏడాదికి కనీసం ఒక మొక్కను నాటడమే కాకుండా, దానిని ఒక బాధ్యతగా దత్తత తీసుకుని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని నర్సరీలో 500 మొక్కలు నాటడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం,జి ఎల్ ప్రసాద్, ఎస్.కె ఏజెంట్ సంతోష్ కుమార్, కేకే ఏజెంట్ ఖాదిర్, ఐ ఈ డి (డి జి యం) కిరణ్ కుమార్, ఫారెస్ట్ అధికారి నవీన్, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకట్ రెడ్డి , వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు కార్మికులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనుల్లో జాప్యం

**అధికారులపై మండిపడ్డ సిఎం రేవంత్**

హైదరాబాద్,జులై : హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులు నిదానంగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్ లో ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశం ఇచ్చారు. పనుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవన్న సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ కు వెనకాడొద్దన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్దిదారులకు అందజేయాలని ఆదేశించారు.



## భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకుల తోడుపాటు

**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ, నెక్నంపూర్ ప్రజల సహాయార్థం భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు చేపట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తోడుపాటుకు మంగళవారం రోజున మణికొండ క్వార్టర్ వద్ద ప్రజల నుండి అనూహ్య స్పందన వచ్చిందని గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, జ్ఞానేశ్వర్, భానుచందర్, దేవి ప్రియ, ఆరిఫ్ మహమ్మద్, ముత్తశీగి లక్ష్మయ్య, సచిన్, ఉప్పల్ స్వామి, దీపక్ సింగ్ లు తెలుపుతూ ఈ సందర్భంగా విచ్చేసిన ఓటరులకు సంపూర్ణ మద్దతుతో బి.ఎల్.ఓ ల వద్ద ఉన్న ఫారమ్ తీసుకోడానికి, ఇబ్బందులకు గురి కాకుండా వాటిని పూరించడానికి, ప్రతి ఓటర్ 2002 లోని తమ ఓటు లేదా తమ పెద్దల ఓటుతో ప్రస్తుత ఓటును జత కలుపడం (మ్యాపింగ్ చేసుకొవడం) లో తమ వంతు సహకారం అందించామనీ నిర్వహకులు తెలిపారు.

## చిత్రపురి కాలనీవాసులకు, వాహనదారులకు హెచ్చరిక

**పలు మార్గాల్లో రోడ్డు దిగ్బంధం**



**గండిపేట(క్రైం మిర్రర్):** చిత్రపురి కాలనీ సభ్యులకు, కిమ్స్ హాస్పిటల్ రోడ్డు వైపు నుండి వచ్చే వాహనదారులకు నార్సింగి సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు ముఖ్యమైన ప్రకటన విడుదల చేశారు.చిత్రపురి కాలనీ కమిటీ కోరిక మేరకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఎంఐజి వద్ద ఉన్న ప్రభాకర్ రెడ్డి గారి విగ్రహం నుండి ఎల్ ఐజి వరకు నూతనంగా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో ఈ మార్గంలో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తూ రోడ్డును బ్లాక్ చేస్తున్నారు. ఎల్ఐజి నుండి ఎంఐజి వైపు వచ్చే వాహనాలకు అనుమతి లేదు. అదేవిధంగా ఎంఐజి నుండి ఎల్ ఐజి వైపు వెళ్లే వాహనాలకు కూడా అనుమతి లేదని అధికారులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు కాలనీవాసులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని జీహెచ్ఎంసీ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని నార్సింగి సర్కిల్ అధికారులు కోరారు.

## వరుస బైక్ చోరీల కేసులు ఛేదన... ఇద్దరు బాల నేరస్థుల అరెస్ట్.....

చందానగర్ క్రైమ్ మిర్రర్ : చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు బాల నేరస్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 7 కేసులను ఛేదించి 7 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జతీ.చీశీ.628/2026 కేసు దర్యాప్తులో భాగంగా 21-07-2026 తెల్లవారుజామున లింగంపల్లి రైల్వే స్టేషన్ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని పట్టుకొని విచారించగా, చందానగర్, ఐడీఏ బొల్లారం, జగద్గిరిగుట్ట, మియాపూర్, బాచుపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో 7 ద్విచక్ర వాహనాల చోరీలు చేసినట్లు అంగీకరించారు.వారి వద్ద నుండి 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితులను జువెనైల్ జస్టిస్ బోర్డు, ఎల్.బి.నగర్ వారి ఎదుట హాజరుపరచి ఆబ్జర్వేషన్ హోమ్ రిమాండ్ కోరారు.ఈ కేసును చందానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వి. జనయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ పనిలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు ప్రభాకర్, ఆది శ్రీనివాస్, గోపీకృష్ణ, రాజు లను ఉన్నతాధికారులు అభినందించారు.ంప్రజలకు విజ్ఞప్తి: వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేసి హ్యాండిల్ లాక్‌తో పాటు అదనపు లాక్‌లు వాడాలి. అనుమానాస్పద వ్యక్తుల గురించి డయల్-100 కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



# 32 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన బాల్యమిత్రులు

**ఆత్మీయతకు చిరునామాగా నార్సింగి జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం**

**ఏడాదికోసారి కలుద్దామని తీర్మానం**

**అవసరంలో ఒకరికొకరు అండగా ఉంటామని ప్రతిజ్ఞ**



**గండిపేట(క్రైం మిర్రర్):** కాలం మూడు దశాబ్దాలకు పైగా గడిచినా.. బాల్య స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు. 1994--95 విద్యా సంవత్సరంలో నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 32 ఏళ్ల అనంతరం ఒకే వేదికపై కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయంగా మమేకమయ్యారు. రంగారెడ్డి జిల్లా ఖానాపూర్ గ్రామంలోని మండవ ఇంట్లో అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ అపూర్వ సమ్మేళనం భావోద్వేగ క్షణాలకు వేదికగా నిలిచింది. దాదాపు 150 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యుల్లా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పలకరించుకున్నారు. చిన్ననాటి అల్లరులు, పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలు, గురువుల బోధనలు, ఆటలు, పాటలు, అప్పటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ నవ్వులు పూయించారు. ఎంతోకాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు తమ జీవిత ప్రయాణంలో ఎదురైన కష్టసుఖాలను పరస్పరం పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 1994--95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన సుమారు 150 మంది సహచర విద్యార్థుల్లో అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరుకావడం విశేషం. ఒకే వేదికపై స్నేహితులందరూ కలుసుకోవడంతో ఖానాపూర్ గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమాన్ని సహచర విద్యార్థులు మహికృష్ణ , హరికృష్ణ, రాజు, రమేష్, నాగిరెడ్డి, ప్రవీణ్ కుమార్, సుధాకర్, శ్రీపాల్ తదితరులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులను సహచర విద్యార్థినులు త్రివేణి, ఉమాదేవి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా త్రివేణి, ఉమాదేవి మాట్లాడుతూ, “ఇలాంటి ఆత్మీయ కలయికలు జీవితంలో చాలా అరుదుగా వస్తాయి. మన స్నేహితులందరూ ఎక్కడ ఉన్నా ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాం. మన స్నేహబంధం తరతరాలకు ఆదర్శంగా నిలవాలి” అని అన్నారు. గతంలో 15 సంవత్సరాల క్రితం ఒకసారి కలుసుకున్నామని, ఇకపై మరో 15 సంవత్సరాలు వేచి చూడకుండా ప్రతి ఏడాది తప్పనిసరిగా సమావేశమై పరస్పరం కష్టసుఖాలు పంచుకోవాలని పూర్వ విద్యార్థులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. జీవితంలో ఎలాంటి ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత ఇబ్బందులు ఎదురైనా ఒకరికొకరు అండగా నిలవాలని, సహచర మిత్రుల సంక్షేమమే తమ బాధ్యతగా భావించాలని ప్రతిజ్ఞ చేశారు. “కోట్లాది రూపాయల ఆస్తి ఉన్నా... చిన్ననాటి స్నేహితులతో కలిసి గడిపే కొన్ని గంటల ఆనందానికి సాటిరాదు. ఆ జ్ఞాపకాలు జీవితాంతం చిరస్థాయిగా నిలిచిపోతాయి” అని పలువురు పూర్వ విద్యార్థులు భావోద్వేగంగా పేర్కొన్నారు. మధుర జ్ఞాపకాలు, ఆప్యాయ ఆలింగనాలు, ఆత్మీయ పలకరింపులు, నవ్వులు, కన్నీటి తడులు కలగలిసిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రతి ఒక్కరి హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

# గుండాల మండలంలో పరిపాలన అస్తవ్యస్తం!






- ఖాళీ కుర్చీలతో నడుస్తున్న కార్యాలయాలు
- ప్రజలకు చుక్కలు చూపిస్తున్న అధికారుల కొరత
- ఏడు గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు లేరు...
- సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, ఎంపీవో పోస్టులు ఖాళీ
- జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని ప్రజల డిమాండ్


**గుండాల, జూలై 21 (క్రైమ్ మిర్రర్):** గుండాల మండలంలో ప్రభుత్వ పరిపాలన ప్రశ్నార్థకంగా మారింది. కార్యాలయాల్లో అధికారులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండగా, ప్రజలు మాత్రం చిన్నచిన్న పనుల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులు లేకపోవడం గ్రామీణ పరిపాలనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జనన, మరణ ధ్రువపత్రాలు, అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి కీలక సేవలు ఆలస్యమవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదే సమయంలో మండల కార్యాలయంలో సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, ఎంపీవో వంటి కీలక పోస్టులు కూడా ఖాళీగా ఉండటం పరిపాలనా వైఫల్యానికి అద్దం పడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు లేకపోవడంతో ఫైళ్లు పేరుకుపోతుండగా, ప్రజల సమస్యలకు పరిష్కారం దొరకని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిపై పెద్దపెద్ద ప్రకటనలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో అధికారులు లేక ప్రజలకు సేవలు అందకపోవడం బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు. పోస్టులు ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనులు మందగించి, ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి గుండాల మండలంలోని అన్ని ఖాళీ పోస్టులను అత్యవసరంగా భర్తీ చేసి, ప్రజలకు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ప్రజాసంఘాలు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## మాజీ సింగిల్ విండో అధ్యక్షునికి నివాలు

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి జులై 21 క్రైమ్ మిర్రర్ :** పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ రెడ్డి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు నారమ్మ గారి తిక్క రెడ్డి మరణవార్త తెలుసుకున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి చేరుకొని తిక్క రెడ్డి గారి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం తిక్క రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తిక్క రెడ్డి రైతుల సంక్షేమానికి గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన నాయకుడని కొనియాడారు ఆయన మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా గ్రామ ప్రజలకు రైతు సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు తిక్క రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మండల అధ్యక్షులు వనం రాములు పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి గ్రామ సర్పంచ్ హేమలత బి అర్ ఎస్ ముఖ్య నాయకులు వెంకటేష్ రాజశేఖర్ సాయినాధ్ మధు వేణు రెడ్డి వెంకటస్వామి బుచ్చన్న వేణు గ్రామ ప్రజలు పాల్గొన్నారు





## కాంగ్రెస్ నియామకాలపై మణికొండలో అసంతృప్తి జ్వాలలు

**బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి పదవా? సీనియర్లకు మొండిచేయా?**

**టీపీసీసీ నిబంధనలు ఏమయ్యాయని స్థానిక నాయకుల ప్రశ్నించిన వైనం.**

**-- సీఎం రేవంత్ రెడ్డి, అధిష్టానం పునరాలోచించాలని ఏకగ్రీవ విజ్ఞప్తి.**

**గండిపేట్ : (క్రైమ్ మిర్రర్)** మణికొండ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్ష నియామకం స్థానిక సీనియర్ నాయకులు, కార్యకర్తలలో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. పదేళ్ల పాటు పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారిని పక్కనపెట్టి, ఇటీవలే బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి బాధ్యతలు అప్పగించడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మణికొండ, నెక్నంపూర్ డివిజన్ల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన సమావేశం అనంతరం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నెక్నంపూర్ డివిజన్ అధ్యక్షుడిగా మెరుగు జితేందర్‌ను నియమించడం పట్ల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అయితే మణికొండ డివిజన్ అధ్యక్ష పదవి కేటాయింపు విషయంలో పార్టీ అధిష్టానం వ్యవహరించిన తీరుపై నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కనీసం మూడేళ్ల పాటు పార్టీలో సేవలందించిన వారికే పదవులు ఇస్తామని స్వయంగా టీపీసీసీ అధ్యక్షుడు ప్రకటించారు, మరి మణికొండలో ఆ నిబంధనను ఎందుకు పక్కనపెట్టారు అని స్థానిక నాయకులు ప్రశ్నించారు. పార్టీ కష్టకాలంలో జెండా మోసి, అనేక అవమానాలను తట్టుకుని నిలబడిన సీనియర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఈ నియామకం ఉందని ఆవేదన చెందారు. కొత్తగా వచ్చే వారిని సాధరంగా ఆహ్వానిస్తామని, కానీ పదేళ్లుగా చెమటోడ్చిన వారిని పూర్తిగా విస్మరించడం సరైన పద్ధతి కాదని వారు స్పష్టం చేశారు. పార్టీ కోసం పదేళ్లు పోరాడిన మా సేవలకు విలువ లేదా అని నిలదీశారు. కాంగ్రెస్ అధిష్టానం తక్షణమే స్పందించి, మణికొండ నియామకంపై పునరాలోచన చేయాలని, సీనియర్ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇచ్చి న్యాయం చేయాలని ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, యాలాల నరేష్, పురుషోత్తం, మల్లేష్, అహ్మద్ షా ఖాన్, సావిత్రి, మహేష్ రెడ్డి, వాసిరెడ్డి నరేష్, షేక్ హాజీ, కుమార్, అఖిల్, రమేష్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, రాము, శివ రెడ్డి, శరత్, శ్రవణ్, జగన్, పవన్, ఇమ్రాన్, జలాల్ భాయ్, శ్రీకాంత్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో యువకుడు మృతి



**మందమర్రి టౌన్ జులై 21 క్రైమ్ మిర్రర్:** మందమర్రి పట్టణానికి చెందిన యువకుడు పెళ్లి కావడం లేదని తీవ్ర మనస్థాపానికి చెంది మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మందమరి ఎస్సై నరేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందగులపేట్‌కు చెందిన కొమ్ము రాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని అతనికి 32 ఏళ్లు వచ్చినా ఇంకా వివాహం కాకపోవడం, ఎన్ని సంబంధాలు చూసినా కుదరకపోవడంతో గత కొంతకాలంగా తీవ్ర దిగులు, మనస్థాపం చెందాడని అన్నారు.మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు పెరట్లోకి వెళ్లిన సమయంలో, రాజు ఇంట్లోకి వెళ్లి లోపల నుండి తలుపులు గడియ పెట్టుకున్నాడని ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి తలుపు తట్టగా స్పందన రాలేదని చెప్పారు.దీంతో ఇంటి కిటికీ రేకుల సందుల నుండి చూడగా రాజు ఉరివేసుకొని కనిపించాడని చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లేసరికి రాజు ఉపిరిఆడక మృతి చెంది ఉన్నాడని తెలిపారు.మృతుడి తమ్ముడు కొమ్ము సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు వారు తెలిపారు.

## స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి



**వనపర్తి జులై 21 క్రైమ్ మిర్రర్ :** సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెబ్బేరు మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి గోపాల్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మొగులయ్య లు మాట్లాడుతూ జరిగే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని జులై 22వ తేదీన జరిగే నిరసనలు రైతులు రైతు కూలీలు పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని కోరుచున్నాము.కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీ కేంద్రంలోని జంతర్ మంతర్ దగ్గర నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి నీటు లీకేజీ, సీబీఎస్సీ అక్రమాలు విద్యావ్యవస్థలో మార్పులు చేయాలని కోరుతూ సిజేపి ఆధ్వర్యంలో ఢిల్లీలో నిరసనలు సాగుతున్నాయి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ సోనం వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆమరణ నిరాహార దీక్షను భగ్నం చేయాలని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేసి మొన్న రాత్రి తీసుకుపోయి దవఖానలో అడ్మిట్ చేశారు దేశంలో ప్రతి పౌరునికి నిరసన చేసే హక్కు ఉంటుంది కానీ 2014లో బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడికక్కడ రైతాంగాన్ని, విద్యార్థులు, యువకులను నిరసన చేస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారు ఇందులో భాగంగా నీటు పేపర్ లీకేజీ సీబీఎస్సీ అక్రమాలకు నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిజేపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగుతున్నది. ఈ పార్లమెంటు సమావేశాల సందర్భంగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ పార్లమెంటుకు శాంతియుతంగా ర్యాలీ చేయాలని సీజెపి పార్టీ నిర్ణయించినది క్రమంలో సిజేపి పార్టీ దేశ అధ్యక్షులు అభిజిత్ దీప్కేను అరెస్టు చేశారు మరియు సోనాం వాంఛిక్నో నిర్బంధించారు కనుక వెంటనే అభిజిత్ దీపికను విడుదల చేసి, సోనం వాంగ్చుక్ పై నిర్బంధం ఎత్తివేయాలని, ఎస్ కె ఎం కరపత్రాల విడుదల చేస్తూ ఈ సమావేశం డిమాండ్ చేస్తున్నది ఈ కార్యక్రమంలో ఎస్ కే యం నాయకులు రాష్ట్ర రైతు సంఘం మొగులన్న, గంధం మొగులయ్య, నాగన్న రాముడు, రాజు, గాంధీ ఎల్ల స్వామి, బుచ్చన్న తదితర రైతులు పాల్గొన్నారు.

## చిన్నారికి జర్నలిస్టుల ఆర్థిక సహాయం...

**కోదాడ జులై 21 క్రైమ్ మిర్రర్:** కాలేయ సమస్యతో ఇబ్బంది పడుతున్న చిన్నారి వడ్లమూడి దక్షిక కు జర్నలిస్టుల సంఘం రాష్ట్ర నాయకులు కారింగుల అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కోదాడ పట్టణంలోని గాంధీనగర్ లో నివాసం ఉంటున్న వడ్లమూడి దక్షిక కాలేయం సమస్యతో ఇబ్బంది పడుతుంది. చికిత్స కోసం 30 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిరుపేద కుటుంబానికి చెందిన దక్షిక తల్లితండ్రులు వైద్యం చేపించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాతల సహాయం కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో సమస్యను తెలుసుకున్న ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు చిన్నారి ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సలిగంటి మురళి, పిడమర్తి గాంధీ, కుడుముల సైదులు, మరికంటి లక్ష్మణ్, వెన్నెబోయిన పూర్ణ చందర్ రావు,నజీర్,చెరుకుపల్లి శ్రీకాంత్, తోటపల్లి నాగరాజు, గంధం వెంకటనారాయణ, వాసు, సంపత్, పల్లపు శ్రీను, నజీర్,కోలా వెంకట్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.





# సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

**పాలకవీడులో పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమం**

**రోడ్డు భద్రతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి**

**పాలకీడు మండల ఎస్ఐ కోటేష్**

**క్రైమ్ మిర్రర్ , హుజూర్ నగర్ (పాలకీడు) :** రోడ్డు ప్రమాదాలను తగ్గించి సురక్షిత ప్రయాణాలను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్–అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పాలకీడు మండల ఎస్ఐ కోటేష్ అన్నారు.

పాలకవీడు గ్రామ కేంద్రంలో మంగళవారం పాలకవీడు పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అండ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు, ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రయాణ నియమాలను పాటిస్తూ క్షేమంగా ఇంటికి చేరాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని స్పష్టం చేశారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాదాల బారి నుండి ప్రాణాలను ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని, వయసు నిండకుండా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని విద్యార్థులను హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే బాధ్యతాయుతంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు.

# శంకర్‌పల్లిలో కనుల పండువగా పూరీ జగన్నాథ స్వామి రథయాత్ర



**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** సోమవారం శంకర్‌పల్లిలో పవిత్రమైన పూరీ జగన్నాథ స్వామి రథయాత్ర కనుల పండువగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఇస్కాన్ టెంపుల్, అక్షయ పాత్ర సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్ర స్థానిక గీతా మందిర్ నుంచి ప్రారంభమై పురవీధుల గుండా శోభాయమానంగా సాగింది. వేద మంత్రోచ్ఛారణలు, భజనలు, కీర్తనల మధ్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎండోమెంట్ సెల్ (ధార్మిక) రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, మరకత్ శివలింగ నామకరణ భక్తుడు, ఆలయ పునర్నిర్మాణ శ్రీకారకుడు, భక్తి టీవీ కోటి దీపోత్సవ రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. సతీష్ కుమార్ (నరేష్ కుమార్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ, శంకర్‌పల్లిలో తొలిసారిగా ఇస్కాన్ టెంపుల్, అక్షయ పాత్ర సంయుక్త ఆధ్వర్యంలో పూరీ జగన్నాథ స్వామి రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సనాతన ధర్మ పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు జైరాం రెడ్డి, నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారూ.

# తల్లి అదృశ్యం.. ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఆందోళన

**శ్రీరామ ధర్మకాంటా వెనుక ప్రాంతంలో కనిపించకుండా పోయిన మహిళ**



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** శ్రీరామ ధర్మకాంటా వెనుక ఉన్న పప్పుల కంపెనీలో పనికి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఈ మేరకు ఆమె కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు వివరాల ప్రకారం.. మున్నేశ్వర్ సాహ్ భార్య మినాదేవి (40) ఈ నెల 21 జులై 26 ఉదయం ఇంటి నుంచి పనికి వెళ్లారు. అయితే పప్పుల కంపెనీలో పని లేకపోవడంతో సెక్యూరిటీ గార్డు ఆమెను తిరిగి ఇంటికి పంపించినట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. కానీ ఆమె ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన ప్రదేశాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అదృశ్యమైన మహిళ వివరాలు పేరు మినాదేవి (40) భర్త మున్నేశ్వర్ సాహ్ ఎత్తు సుమారు 4.5 అడుగులు ఛాయ. గోధుమ వర్ణం దుస్తులు ఎరుపు రంగు చీర ధరించి ఉన్నారు భాష కేవలం భోజ్‌పురి మాత్రమే మాట్లాడగలరు. మినాదేవి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

# ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఢిల్లీలో శాంతియుతంగా "మార్చ్ టు పార్లమెంట్" నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం, భాష్ప వాయు (టియర్ గ్యాస్) ప్రయోగించడం అత్యంత అమానవీయమని యస్ ఎస్ ఎఫ్ ఐ , జార్జి రెడ్డి పిడిఎస్యు ఐసా వామపక్ష విద్యార్థి సంఘాల ఖమ్మం జిల్లా కమిటీ లు తీవ్రంగా ఖండించాయి. ఈ ఘటనకు నిరసనగా ఖమ్మం జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాల్లో , మండలాలలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ జిల్లా కన్వీనర్ జమ్మి అశోక్ పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ, దేశంలో బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలనను కొనసాగిస్తోందని విమర్శించారు. ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్‌లు, భాష్ప వాయు ప్రయోగాలతో అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తే వారిపై దాడులు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకారపూరిత వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం దెబ్బతిన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించకుండా ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ ఘటనకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రధానమంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంతో తీవ్ర మానసిక వేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తగిన నష్టపరిహారం ప్రకటించాలని, పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆందోళన చేస్తున్న విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల గొంతును అణచివేసే ఫాసిస్టు విధానాలను దేశ ప్రజలు సహించరని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు దాడిని తీవ్రంగా ఖండించారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకోవాలి**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ, ఫిర్యాదుల పరిష్కారం, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరిస్తూ, ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 80 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 65 శాతం డిజిటలైజేషన్ జరిగిందని తెలిపారు. జిల్లాలో శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల సంఖ్య సుమారు 55 వేలు (5 శాతం) ఉండగా, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో సుమారు 85 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సోమవారం ఒక్కరోజే జిల్లాలో 20 వేల మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని, ఇదే వేగంతో పనులు కొనసాగిస్తే రానున్న ఐదు రోజుల్లో 90 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకుంటామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించిన మేరకు ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) లక్ష్యం మేరకు ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసేలా కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, 50 శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరుకి అందించిన ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో బీఎల్‌వోలు ప్రజలకు సహకరించాలని, ఎన్నికల సంఘం రూపొందించిన అవగాహన వీడియోలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, ఇతర ఎన్నికల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ లీకేజీలను అరికట్టలేక, న్యాయం కోరిన విద్యార్థి-యువతపై లాఠీచార్జ్ చేస్తున్న చేతకాని బీజేపీ ప్రభుత్వం

**ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు 100కు పైగా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలు చోటుచేసుకుని లక్షలాది మంది విద్యార్థుల, యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు న్యాయం కోరుతున్న విద్యార్థి, యువతపై దమనకాండకు పాల్పడుతోందని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ తీవ్రంగా విమర్శించారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనపై న్యాయ విచారణ జరిపి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోని విద్యార్థులు, యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటం కొనసాగుతుందని సాయికుమార్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో దేశంలో ఎక్కడ విద్యార్థులకు, యువతకు అన్యాయం జరిగినా అక్కడ యువజన కాంగ్రెస్ ముందుండి పోరాటం చేస్తుందని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని వేజెండ్ల సాయికుమార్ స్పష్టం చేశారు.



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

**యువత పై లాఠీచార్జ్ అమానుషం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**బైపాస్ రోడ్డులో సిపిఐ రాస్తారోకో**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తులో చెలగాటమాడిన ఆయనను కేంద్ర -మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి ఆందోళన చేపట్టిన విద్యార్థి యువకులపై లాఠీ చార్జ్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులో సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ , ఉద్యోగ ఉపాధి కల్పనలో పూర్తిగా విఫలమైన మోడీ సర్కార్ ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి ప్రశ్నా పత్రాల లీకేజీ ద్వారా అవినీతికి పాల్పడుతుందన్నారు. లీకేజీకి కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ ను మోడీ ఎందుకు బర్తరఫ్ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య స్ఫూర్తిపై బీజేపీ ప్రభుత్వం చేసిన దాడి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిందని, ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానపరచడమేనని అన్నారు. ప్రతిపక్షం ప్రశ్నిస్తే అరెస్ట్ చేయడం, విమర్శిస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం బీజేపీ పాలనలో నిత్యకృత్యంగా మారిందని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విభిన్న అభిప్రాయాలను గౌరవించాల్సిన కేంద్ర ప్రభుత్వం, నిరంకుశ ధోరణితో వ్యవహరించడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ముందుంటుందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించే ఈ పోరాటంలో వెనక్కి తగ్గేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.


File Photo

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.